
ఈనాడు ఆదివారం

27 జులై 2025



కుబేరుల కోసం... ఫ్యామిలీ ఆఫీస్!



వరాలతల్లికి వేవేల దండాలు!



'హ.. హ.. హాసిని' అంటూ బొమ్మరిల్లు సినిమాతో తెలుగు ప్రేక్షకులను మురిపించిన నటి **జెనీలియా.** తన అందం, అభినయంతో దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందీ ముంబయి భామ. దాదాపు పదమూడేళ్ల విరామం తర్వాత 'జూనియర్' సినిమాతో మళ్లీ తెలుగు తెరపైన తళుక్కుమంది. ఈ సందర్భంగా తన గురించి చెబుతోందిలా..

ప్రేక్షకులు నన్ను మర్చిపోయారనుకున్నా!

పేరు మార్చుకోనని చెప్పా

నేను పుట్టి పెరిగిందంతా ముంబయిలోనే. అమ్మానాన్నల పేర్లలోని అక్షరాలు కలిసొచ్చేలా నాకు జెనీలియా అని పేరు పెట్టారు. అందుకే, ఇండస్ట్రీలోకి వచ్చాక పేరు మార్చుకోమని చాలామంది చెప్పినా కుదరదన్నాను. అందరూ నన్ను ముద్దుగా జీనూ అని పిలుస్తుంటారు.



అమితాబ్ మెచ్చుకున్నారు

నేను జాతీయ స్థాయి ఫుట్‌బాల్ ప్లేయర్‌ని. ఇంటర్‌లో ఉన్నప్పుడు పాకెట్ మనీ కోసం మోడలింగ్‌లోకి వచ్చా. మొట్టమొదటి యాడ్‌లోనే అమితాబ్‌తో కలిసి నటించే అవకాశం రావడం, సెట్‌లోనే నా నటనను ఆయన ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేను.

మళ్లీ ఆడిషన్ ఇచ్చా

ఒకరోజు ఆమీర్‌ఖాన్ ఫోన్ చేసి.. 'సితారే జమీన్ పర్' డైరెక్టర్‌ను కలవమన్నారు. నటిగా నేను నిరూపించుకున్నాక కూడా- ఆయన మళ్లీ ఆడిషన్ చేశాకే.. నన్ను ఆ సినిమాలో లీడ్ రోల్‌కి ఎంపిక చేశారు. అలా చేయడం నాపైన నాకూ నమ్మకాన్ని పెంచింది. 'జూనియర్' సినిమాలోనూ నా పాత్ర కీలకం కావడంతో నటించేందుకు అంగీకరించా.

ఖాళీ దొరికితే..

ఏ కాస్త సమయం దొరికినా పిల్లలతో కలిసి ఇంట్లోనే గడిపేందుకు ఇష్టపడతా. రితేశ్‌తో కలిసి సరదాగా రీల్స్ చేస్తూ.. వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తుంటా. అప్పుడప్పుడూ ఐలాండ్స్‌కు వెళ్తుంటాం. ఈ మధ్య వెళ్లిన వాటిల్లో నాకు బాగా నచ్చిన ప్రదేశం బాలి.

ఎదురుచూసే పండుగ అది..

చిన్నప్పుడు దీపావళి అంటే మిఠాయిలూ, మతాబులూ మాత్రమే అనుకునేవాళ్లం. కానీ, పెళ్లయ్యాక పిల్లలు పుట్టాకా.. ప్రతి దీపావళికి రితేశ్ వాళ్ల సొంతూరికి వెళ్లడం అలవాటుగా మారింది. అక్కడే కుటుంబ సభ్యులందరం కలిసి సరదాగా గడుపుతాం. అందుకే ఆ పండుగ కోసం ఏడాదంతా ఎదురు చూస్తుంటా.

పదేళ్లు డేటింగ్‌లో...

2003లో విడుదలైన నా మొదటి సినిమా 'తుఝె మేరీ కసమ్' కోసం నేనూ, రితేశ్ కలిసి తొలిసారి వర్క్ చేశాం. ఆ పరిచయమే ప్రేమగా మారింది. దాదాపు పదేళ్లు డేటింగ్‌లో ఉన్నాం. ఆ తర్వాతే పెళ్లి చేసుకున్నాం.

ఇతరులపైన ఆధారపడను

పిల్లలు పుట్టిన తర్వాత యాక్టింగ్‌కు దూరమయ్యా. ఇల్లు, కుటుంబమే ప్రపంచంగా బతికాను. పిల్లలు కాస్త పెద్దవాళ్లు కావడంతో మళ్లీ సినిమాల్లోకి వస్తానంటే తెలిసిన వాళ్లంతా వద్దన్నారు. కానీ, నేనే ధైర్యం చేసి 'వేద్' చేశా. ఆ చిత్రం విజయంతో ఇతరుల సలహాలపైన ఎక్కువగా ఆధారపడకూడదని అర్థమైంది.



పిల్లలకు తెలియదు

మొదట్లో మా పిల్లలకు నేను నటినని తెలియదు. వాళ్లకు పర్యావరణ స్పృహ ఎక్కువ. వేడుకలను సింపుల్‌గా చేసుకోవాలనీ, ఎలక్ట్రిక్ వాహనాలనే వాడాలనీ చెబుతుంటారు.

ఆ సినిమాల విజయంతో...


వెండితెరకు దూరమై చాలా సంవత్సరాలు కావడంతో అందరూ నన్ను మర్చిపోయారనుకున్నా. కానీ, తెలుగు 'మజిలీ'కి మరాఠీ రీమేక్ 'వేద్', 'సితారే జమీన్ పర్' సినిమాల విజయంతో... ప్రేక్షకులు నన్ను ఇంకా అభిమాని స్తున్నారని తెలుసుకున్నా.

మెచ్చే నటులు

నేను కలిసి పనిచేసిన ప్రతి హీరో నుంచి ఏదో ఒక విషయం నేర్చుకుంటుంటా. షారుఖ్ ఖాన్, ఆమిర్ ఖాన్, కాజోల్‌ను అభిమానిస్తా.



క్లిక్... క్లిక్...



ఎగసే అలల నురగలే కాదు, తీరమంతా కూడా పాలరంగు బంతులతో మెరిసిపోతున్న ఈ చిత్రం విచిత్రంగా లేదూ! ఫిన్లాండ్‌లోని హైవోతో దీవిలో అప్పుడప్పుడూ కనిపించే ఐస్‌బాల్ ఫినామినా ఇది. నీటి ఉష్ణోగ్రత తగ్గినప్పుడు, దానికి చల్లగాలులూ తోడైతే- అరుదుగా సముద్రతీరంలో ఇలా మంచు బంతులు ఏర్పడతాయట. ఆ అద్భుతమైన దృశ్యం ఓ పర్యటకుడి కెమెరాకి చిక్కింది ఇలా!

హహ్హాహ్హా

అదే ఆప్షన్

కొడుకు: అమ్మా! ఇవాళ నాకు లంచ్‌లో రెండు ఆప్షన్లు ఉంటాయని చెప్పావు కదా.. ఇదేంటి, ఇక్కడ ఒక్క కూర మాత్రమే ఉంది.

తల్లి: నేను చెప్పింది నిజమే. నీకు రెండు ఆప్షన్లు ఉన్నాయి.

కొడుకు: అదెలా?

తల్లి: ఒకటి... ఇష్టం ఉంటే తిను. రెండు... లేకపోతే మానెయ్.

కచ్చితంగా చెప్పలేం

(టూత్ బ్రష్ వాడకంపైన సర్వే చేశాడో డాక్టర్)

డాక్టర్: మీరు టూత్ బ్రష్ ఎంతకాలం వాడతారు...

చైనావాళ్లు: ఆరు నెలలు

అమెరికన్లు: మూడు నెలలు

భారతీయులు: కచ్చితంగా చెప్పలేం. ఒకట్రెండేళ్లు పళ్లు తోముకోవడానికి వాడతాం. ఆ తర్వాత జుట్టుకి రంగు వేసుకోవడానికీ... నగలూ దువ్వెనల్లాంటి వాటిని శుభ్రం చేసుకోవడానికీ... ఇలా రకరకాలుగా చాలా ఏళ్లు వాడతాం.

మన సామెత

తిట్లతో చనిపోయినవారు లేరు, దీవెనలతో బతికినవారూ లేరు

మంచిమాట

సురక్షితంగా ఉన్నప్పుడు సైతం జాగ్రత్తగా ఉండే వారు ప్రమాదం పాలయ్యే అవకాశమే ఉండదు.

లోపల

4 సిల్లీ పాయింట్

5 ముందువైపు కార్తికేయుడు... అద్దంలో నరసింహుడు!

6 పరిశోధన

7 అమ్మో.. అంత జీతమా..!

8 సేవ చేయాలని ఉందా..!

9 కుబేరుల కోసం... ఫ్యామిలీ ఆఫీస్!

12 శ్రీవారి దర్శనానికి దారులెన్నో!

13 తినే సిల్క్... యమ్మీ యమ్మీ!

14 వరాలతల్లికి వేవేల దండాలు!

16 రెస్టరంట్లో వండుకుని తినొచ్చు!

17 వందరోజులే బతుకుతావన్నారు!

18 అవీ ఇవీ

19 నాలుగులక్షల కోట్ల... విజయ రహస్యం ఇదే!

20 కథ

22 సిసింద్రీ

24 రుచి-అభిరుచి

25 రాశిఫలం

26 పదకేళి



సిల్లీ పాయింట్

సముద్రపు కుక్క(సీ ఒటర్)లు నిద్రపోయేటప్పుడు ఒకదానికొకటి చేతులు పట్టుకుంటాయట. ఎందుకూ అంటే... నీళ్లలో మునిగిపోకుండా ఉండటంతోపాటు కొట్టుకుపోకుండానట.

★ ఫ్లెమింగోలు వాటి గొంతు దగ్గర ఉండే గ్రంథుల నుంచి ఎరుపు రంగులో ఉండే పాలను స్రవిస్తాయి. ఈ పాలు-పిల్ల ఫ్లెమింగోల ఆకలి తీర్చడంతోపాటు అవి పింక్ కలర్‌లోకి మారేందుకు తోడ్పడతాయట.

★ మన శరీరంలో 0.02 మిల్లీగ్రాముల బంగారం ఉంటుంది. ఎక్కడా అంటారేమో... రక్తంలో... అతిసూక్ష్మ ఖనిజంలా!

★ లిఫ్టుల్లో రకరకాల మోడల్స్ చూసుంటాం. 1860ల్లో యూరప్ దేశాల్లో 'పటెర్‌నోస్టర్' అనే లిఫ్టులు ఎక్కువగా ఉండేవి. వాటికి తలుపులు ఉండవు. అంతేకాదు... ఆగకుండా పైకీ కిందకూ తిరుగుతూనే ఉంటాయి. భద్రతా కారణాలతో ఆ తర్వాత వాటి వాడకం మానేశారు.

★ అప్పా(తమిళం), అప్ప(కన్నడ), అబ్బ(తెలుగు), అప్పచ్చన్(మలయాళం)... నాన్న అని అర్థం ఇచ్చే ఈ మాటకి మూలం 'అబ్బా' అన్న హిబ్రూ పదమట!

★ లైబ్రరీ నుంచి పుస్తకాలు తీసుకోవడం... మరిచిపోయి తిరిగివ్వకపోవడం చాలామందికి అలవాటే కానీ ఇందులో ఓ గిన్నిస్ రికార్డుంది. 1668లో ట్రినిటీ కాలేజీ లైబ్రరీ నుంచి విద్యార్థి ఒకరు తీసుకున్న పుస్తకం ఒకటి... 1956లో ఆయన వారసులు తిరిగిచ్చారు. 288 ఏళ్ల తర్వాత ఓ పుస్తకం అలా తిరిగిరావడం ఓ తిరుగులేని రికార్డట!

★ జంతుప్రపంచంలో మనుషులకీ, డాల్ఫిన్లకీ మాత్రమే కుడిచేతివాటం ఉంటుంది. మిగతావన్నీ అవసరాన్ని బట్టి ఏ చేతినైనా వాడతాయి.

★ 19వ శతాబ్దందాకా షర్టులు మోకాలిదాకా ఉండేవి. వాటిని అడ్జెస్ట్ చేయడానికే టక్-ఇన్ చేసుకునే అలవాటు వచ్చింది. క్రమంగా అదే ఓ ఫ్యాషన్‌గా మారింది!



కాలిఫోర్నియాలోని సేల్స్‌ఫోర్స్ సంస్థ ఉద్యోగుల్లో 885 మంది- ఐన్‌స్టీన్ వేషధారణలో ఒకేదగ్గర గుమిగూడటం గిన్నిస్ రికార్డులకెక్కింది. సంస్థ ఉత్పత్తుల్లో ఏఐ వాడకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో వాళ్లీ కార్యక్రమం చేపట్టారట.

★ క్రీస్తు పూర్వం నాలుగువేల ఏళ్ల కిందటే ఈజిప్టులో కేకులు చేసే అలవాటుంది. అక్కడి మమ్మీల్లో కనిపించే తప్పనిసరి వస్తువుల్లో ఇవీ ఉంటాయట.

★ గర్భంలో మూడునెలలప్పుడే మనకు వేలిముద్రలు ఏర్పడతాయి.

★ మిగతావాటికన్నా మధ్యవేలి గోరు వేగంగా పెరుగుతుంది మనకు!

★ గాలిలో కన్నా స్టీల్‌లో శబ్దం 15 రెట్లు వేగంగా ప్రయాణిస్తుంది.



భూమ్మీద ఉండే ఆక్సిజన్‌లో దాదాపు 20 శాతం అమెజాన్ అడవుల నుంచే వెలువడుతోందట. అందుకే, వాటిని 'ది లంగ్స్ ఆఫ్ ది ఎర్త్'గా పిలుస్తుంటారు.

గున్న ఏనుగులు తరచుగా వాటి తొండాన్ని చప్పరిస్తుంటాయి. అవి ఒకరకమైన స్వాంత్వన కోసం అలా చేస్తాయట. ఎంత వద్దని చెప్పినా చిన్న పిల్లలు నోట్లో వేలేసుకుంటారే... అలాగన్నమాట.



ఒక మనిషి తన జీవితకాలంలో సగటున 35 టన్నుల ఆహారం తీసుకుంటాడట. అది దాదాపు ఆరు ఏనుగుల బరువుకు సమానమన్నమాట.

మహిళలు రంగుల్ని గుర్తించడంలో మెరుగ్గా ఉంటే, మగవారు... కదిలే వస్తువులనూ, దూరంగా ఉన్నవాటినీ వేగంగా గుర్తిస్తారట.

ప్రపంచంలో ఎక్కువగా దొంగతనానికి గురయ్యే ఆహార పదార్థం చీజ్. మొత్తం ఉత్పత్తి అవుతున్న దాంట్లో దాదాపు నాలుగు శాతం చోరీ అవుతోందట.

పిల్లలు మూడేళ్లదాకా తాము కళ్లు మూసుకుంటే... ఎదుటివాళ్లకి కనపడమని అనుకుంటారట. అందుకే దాగుడుమూతలు తప్పుతప్పుగా ఆడుతుంటారు!



'ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ' అనుకుంటూ పసుపు రాసుకోవడం ఒక్క భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ స్త్రీలకే పరిమితం.



ముందువైపు కార్తికేయుడు... అద్దంలో నరసింహుడు!

మిగతా దేవతలతో పోలిస్తే... మన దగ్గర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు తక్కువే. అలాంటి వాటిల్లో మరింత ప్రత్యేకంగా కనిపిస్తుంది కార్తికేయుడు - నరసింహుడు ఒకే చోట స్వయంభువులుగా కొలువుదీరిన 'ఘాటి' సుబ్రహ్మణ్య క్షేత్రం. ఆరువందల సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని దర్శించుకుంటే సంతానం కలుగుతుందనీ, గ్రహదోషాలన్నీ తొలగిపోతాయనీ ఓ నమ్మకం.



ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రతిష్ఠించిన వేలాది నాగదేవతల విగ్రహాలు... గర్భాలయంలో కార్తికేయుడు - నరసింహుడు కలిసి దర్శనం ఇచ్చే అద్భుతమైన రూపాలు... ఆకట్టుకునే ఆలయ నిర్మాణం... ఇవన్నీ చూడాలంటే 'ఘాటి' సుబ్రహ్మణ్య క్షేత్రానికి వెళ్లాలి. బెంగళూరుకు సుమారు అరవై కిలోమీటర్ల దూరంలో... దొడ్డబళ్లాపుర మండలం, తూబగెరెకు దగ్గర్లోని మేలినంజుగనహళ్లి అనే ఊళ్లో ఉందీ ఆలయం. ఆరువందల ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వరుడు, నరసింహుడు భూగర్భంలోంచి స్వయంభువులుగా ఉద్భవించారని ప్రతీతి. కర్ణాటక రాష్ట్రంలో మూడు అత్యంత శక్తిమంతమైన సుబ్రహ్మణ్య క్షేత్రాలు ఉన్నాయనీ, వాటిల్లో మొదటిది 'కుక్కే', రెండోది 'ఘాటి', ఆఖరిది 'నాగలమడికే' ఆలయమనీ ఆధ్యాత్మిక సాధకులు చెబుతారు. ఈ మూడింటినీ సందర్శిస్తే....నవగ్రహాలకు సంబంధించిన దోషాలన్నీ తొలగిపోతాయట. ఏ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలోనూ లేని విధంగా ఇక్కడ కార్తికేయుడు, నృసింహుడు రెండు రూపాల్లో కొలువుదీరడం వెనుక ఆసక్తికరమైన కథ లేకపోలేదు.



స్థలపురాణం

సుబ్రహ్మణ్యస్వామి ఘటికాసురుడు అనే అసురుడిని ఇక్కడ సంహరించాడట. అందుకే ఈ ప్రాంతానికి ఘాటి అనే పేరు వచ్చిందట. అసుర సంహారం తర్వాత స్వామి... ఇక్కడే సర్ప రూపంలో విష్ణుమూర్తి అనుగ్రహం కోసం కఠోరమైన తపస్సు చేయడం ఆరంభించాడట. ఎందుకంటే... విష్ణుమూర్తి వాహనం గరుడాళ్వారు. సర్పాలకు గరుడపక్షి శత్రువు కాబట్టి... దాని వల్ల తమకు ఎలాంటి ఆపాయం కలగకుండా ఉండేందుకే తపస్సు చేశాడట. ఆ సాధనకు మెచ్చి... స్వామి నరసింహుడి రూపంలో ఉద్భవించి ఆ సర్పాలన్నింటికీ రక్షకుడిగా ఇక్కడే ఉండిపోయాడట. అలా నరసింహుడు, కార్తికేయుడు ఈ ప్రాంతంలో భూమి నుంచి ఉద్భవించారని ప్రతీతి. కొన్నాళ్ల తర్వాత ఈ ప్రాంతాన్ని పాలించిన ఘోర్‌పడే పాలకులు ఇక్కడ ఆలయాన్ని నిర్మించి... తమవంతుగా అభివృద్ధి చేశారని కథనం.

సంతానమూర్తిగా...

నిత్యపూజలూ, ప్రత్యేక ఉత్సవాలతో కళకళలాడే ఈ ఆలయానికి ఒక్క కర్ణాటక నుంచే కాకుండా... తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర... తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వస్తారు. రాజగోపురం దాటి లోపలికి ప్రవేశించే భక్తులకు గర్భాలయంలో కార్తికేయుడు ఏడు శిరస్సుల నాగసర్పం రూపంలో... తూర్పువైపు కొలువుదీరి దర్శనం ఇస్తాడు. ఆ స్వామి వెనుకవైపే - అంటే పశ్చిమాన - నరసింహుడు ఉంటాడు. ఆలయానికి వచ్చే భక్తులు ఈ స్వాములిద్దరినీ ఏకకాలంలో కళ్లారా చూసేలా గర్భాలయంలో ఓ పెద్ద అద్దాన్ని ఏర్పాటు చేశారు అర్చకులు. ఇక్కడ పూజలు చేయిస్తే... పిల్లలు లేనివారికి సంతానం కలుగుతుందనీ, రాహు-కేతు, కుజ, ఇతర గ్రహ దోషాలన్నీ పోతాయనీ ఓ నమ్మకం. పూజలు ఫలించి సంతాన భాగ్యం కలిగిన దంపతులు... మొక్కుల రూపంలో ఆలయ ప్రాంగణంలో నాగదేవతల విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. అలా నెలకొల్పిన వేలకొద్దీ విగ్రహాలను ఇక్కడ చూడొచ్చు. ఇక నాగుల పంచమి, నాగుల చవితితోపాటు... ప్రతి మాసంలో కార్తికేయుడికి విశేష పూజలు చేస్తూనే.. నరసింహజయంతినీ అంగరంగ వైభవంగా జరిపిస్తారు. ఏడాదికోసారి రథోత్సవం, బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవం, స్కందషష్ఠి... వంటివాటినీ విశేషంగా జరుపుతారు. ఇంకా... ఈ ఆలయ ప్రాంగణంలో ఏటా నిర్వహించే పశువుల సంతకు విశేషమైన గుర్తింపు ఉంది. ఆ సందర్భంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్రల నుంచి వచ్చే రైతులు పశువుల క్రయవిక్రయాలు జరుపుతారు.

ఎలా చేరుకోవచ్చు

ఘాటి సుబ్రహ్మణ్య ఆలయానికి విమానంలో రావాలనుకునే భక్తులు బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగితే... దాదాపు అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి బస్సులూ, ప్రైవేటు వాహనాలూ అందుబాటులో ఉంటాయి. రైల్లో రావాలనుకునే భక్తులు... మకాలీదుర్గ్ రైల్వేస్టేషన్‌లో దిగొచ్చు. అక్కడినుంచి ఆటోలో ఆలయాన్ని చేరుకోవచ్చు. ★

పరిశోధన



ఆ ప్రమాదంలో పడకుండా...



టైప్-1 రకం మధుమేహరోగులకి ఇదో శుభవార్త. మామూలు షుగర్ పేషెంట్‌లలోకన్నా వీళ్లలో చక్కెర స్థాయులు ఒక్కసారిగా పడిపోయి కోమాలోకి వెళ్లే ప్రమాదం చాలా ఎక్కువ. హైపోగ్లైసీమియా అనే ఈ పరిస్థితి నుంచి వాళ్లని బయటపడేయాలంటే తక్షణం గ్లూకోజెన్ అనే హార్మోన్‌ని ఇంజెక్షన్‌గా ఇవ్వాలి. వాళ్లు మెలకువలో ఉంటే పర్వాలేదు కానీ... నిద్రలో ఉన్నప్పుడు ఈ పరిస్థితి వస్తే అది ప్రాణాంతకంగా మారుతుంది. మెలకువలో ఉన్నా తమకేం జరుగుతుందో తెలుసుకోలేని చిన్నారులకూ దీనివల్ల ప్రమాదమే. ఈ సమస్యని అడ్డుకోవడానికే ఓ సరికొత్త పరికరాన్ని ఆవిష్కరించారు అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) శాస్త్రవేత్తలు. కేవలం గోరంత ఉండే పరికరం ఇది. ఇందులో గ్లూకోజెన్ హార్మోన్‌ని అవసరమైనంత డోసుల్లో చేర్చి, ఓ చిన్నపాటి ఆపరేషన్‌తో- దీన్ని షుగర్ బాధితుల శరీరంలో పెడతారు. వాళ్ల శరీరానికి ఎప్పుడు హైపోగ్లైసీమియా సమస్య వచ్చినా ఈ పరికరం గుర్తించి... తనకు తానే గ్లూకోజెన్ హార్మోన్‌ని రక్తంలోకి విడుదలచేస్తుంది. అలా వాళ్ల షుగర్‌ని మామూలు స్థితికి తెచ్చి ప్రాణాపాయం నుంచి రక్షిస్తుందట.



ఆ తీపి వద్దు!

మన దగ్గర పిల్లలకు తొమ్మిది లేదా పదకొండేళ్లు వస్తూనే ఓణీ పండగలనీ, ధోతీ వేడుకలనీ చేస్తున్నాం. మనమైతే బంధుమిత్రులందరూ ఒక్కటై పిల్లల్ని ఆశీర్వదించే ముచ్చటగా దీన్ని చూస్తున్నాం కానీ... అంత చిన్నవయసులోనే పిల్లల్లో యవ్వన ఛాయలు కన్పించడాన్ని వైద్య ప్రపంచం ఓ పెద్ద సమస్యగానే భావిస్తోంది. తొమ్మిదేళ్ల వయసుకన్నా ముందే అమ్మాయిల్లో రుతుక్రమం మొదలుకావడం, మగ పిల్లల్లోనూ ముందుగానే యవ్వనఛాయలు కన్పించడాన్ని ప్రికాషస్ ప్యూబర్టీ (పీపీ) అంటున్నారు శాస్త్రవేత్తలు. దీని వల్ల పిల్లలు పొట్టిగా ఉండటమే కాదు... భవిష్యత్తులో వాళ్లకి మధుమేహం, హృద్రోగ సమస్యలూ వచ్చే ప్రమాదం ఎక్కువంటున్నారు. పిల్లలు ఇలా ముందుగానే ఈడేరడానికి... ఆహార పదార్థాల్లో వాడే ఆర్టిఫిషియల్ స్వీట్‌నర్లు ఓ కారణమని తాజాగా నిరూపించారు తైవాన్‌లోని తైపే యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఇందుకోసం సుమారు 1500 పిల్లలపైన ఏడేళ్లపాటు పరిశోధన చేశారువాళ్లు. సుక్రలోజ్, అసెక్, అతిమధురం వంటి కృత్రిమ తీపిని చేర్చిన స్వీట్లూ పానీయాలూ అధికంగా తీసుకునేవారిలో ఈ సమస్య ఎక్కువని చెబుతున్నారు. ఇవి మెదడులోని ప్యూబర్టీ హార్మోన్‌లని ముందుగానే ప్రేరేపిస్తున్నాయనీ పిల్లల్ని వీలున్నంత వరకూ వాటికి దూరంగా ఉంచాలనీ చెబుతున్నారు.



వ్యక్తిత్వాన్ని బట్టే వ్యాయామం!

నేడు వైద్యం ఎవరికి తగ్గట్టు వాళ్లకి కస్టమైజ్ అవుతోంది... మరి వ్యాయామం ఎందుకలా కాకూడదని ప్రశ్నిస్తున్నారు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా-లాస్ ఏంజెలెస్‌కి చెందిన శాస్త్రవేత్తలు. మన మనస్తత్వానికి తగ్గ వ్యాయామాన్ని ఎంచుకుంటేనే దాన్ని జీవితాంతం కొనసాగిస్తామనీ ప్రతిసారీ ఆనందిస్తామనీ చెబుతున్నారు. ఈ శాస్త్రవేత్తలు వివిధ దేశాలకి చెందిన సుమారు 1500 మంది నడివయస్కుల వ్యాయామాల తీరుతెన్నుల్ని పరిశీలించారు. దాన్నిబట్టి నిత్యం చురుగ్గా దూకుడుగా ఉండేవాళ్లు, తమలో తాము ముడుచుకుపోయేవాళ్లు, ఆ రెండూ కాకుండా మధ్యస్థంగా ఉన్నవాళ్లు... అని మనుషుల్ని మూడు రకాలుగా వర్గీకరించారు. దూకుడెక్కువగా ఉన్నవాళ్లకి పరుగు, బరువులెత్తడం లాంటి తీవ్ర వ్యాయామాలు మంచిదంటున్నారు. అంతర్ముఖులకి... జాగింగ్, నడకలాంటి తక్కువ తీవ్రత ఉన్నవి నప్పుతాయట. బరువులెత్తడం వీళ్లకి మేలు చేసినా... అవి జిమ్‌లలో అందరితో కలిసి కాకుండా ఒంటరిగా చేయడమే మేలంటున్నారు. ఇక మధ్యస్థంగా ఉన్నవాళ్లు... ఎప్పుడూ ఏ ఒకట్రెండు రకాలకో పరిమితం కాకుండా అన్నింటినీ కలగాపులగంగా ఎంచుకుంటే ఎక్కువ కాలం కొనసాగించగలుగుతారని సూచిస్తున్నారు. మరి మీరు ఏ రకం వ్యాయామాన్ని ఎంచుకుంటారు?


నిద్రే కీలకం...



మగవారితో పోల్చుకుంటే మహిళల్లో హృద్రోగ సమస్యలు చాలా తక్కువ. రుతుక్రమ ప్రక్రియ వాళ్లకి గుండెపోటు నుంచి రక్షణ కల్పిస్తోందని అంటారు. కానీ మెనోపాజ్ దశకి చేరుకున్నాక ఆ రక్షణ పోతోందని శాస్త్రవేత్తలు ఇదివరకే కనిపెట్టారు. 'మరి మెనోపాజ్ దశకి చేరుకున్న వాళ్లందరిలోనూ గుండెపోటు సమస్య ఉంటుందా? లేకపోతే వాళ్ల జీవనశైలి ఇందుకు దోహదం చేస్తోందా?' అన్న ప్రశ్నలతో ఓ సమగ్ర పరిశోధన చేశారు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్, బేలర్ యూనివర్సిటీల శాస్త్రవేత్తలు. ప్రపంచవ్యాప్తంగా మూడువేలమంది మహిళల జీవనశైలిని ఇందుకోసమని అధ్యయనం చేశారు. మధుమేహం, రక్తపోటు, నిద్రలేమి... ఈ మూడూ నడివయసులో ఉన్న మహిళల్లో హృద్రోగ సమస్యలకి దారితీస్తున్నాయని నిర్ధరించారు. అందులోనూ నిద్రలేమి మిగతా రెండింటి ప్రభావాన్ని ఎక్కువ చేస్తోందని తేల్చారు. ఏడు నుంచి తొమ్మిదిగంటలు నిద్రలేనివారిలో దీర్ఘకాలం తర్వాత గుండెపోటు వచ్చే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోందని హెచ్చరిస్తున్నారు. రోజువారి జీవితంలో ఏదోరకంగా వ్యాయామానికి చోటు కల్పించడం, పోషకాహారం తీసుకోవడం చాలా వరకూ నిద్రలేమి నుంచి బయటపడేలా చేస్తాయని చెబుతున్నారు.

అమ్మో... అంత జీతమా..!

నికేష్ అరోరా... 1250కోట్లు, వైభవ్ తనేజా... 1200కోట్లు, త్రపిత్ బన్సల్... 800 కోట్లు. వందకోట్లకి ఎన్ని సున్నాలో లెక్కపెట్టడానికే మనకి కాస్త సమయం పడుతుంది. అలాంటిది ఇన్ని వందల కోట్లు, వాళ్ల ఏడాది జీతాలంటే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే. 'మల్టీ మిలియన్ డాలర్' జీతాలు అందుకుంటున్న ఈ భారతీయుల గురించి మీకూ తెలుసుకోవాలని ఉందా....



పదేళ్ల క్రితం... ఫలానా అమ్మాయికో, అబ్బాయికో 'అమెరికాలో ఐటీ ఉద్యోగమట, ఆరంకెల జీతమట' అని ఎవరైనా అంటే అవునా... అని ఆశ్చర్యపోయేవారు. మరి ఇప్పుడు... ఆ ఆరు కాస్తా పదికి చేరి, ఆ ఆశ్చర్యాన్ని రెట్టింపు చేస్తోంది. అవును, టెక్నాలజీ పుణ్యమాని వందల కోట్లని జీతాలుగా అందుకునేవారి సంఖ్య పెరుగుతోంది. అందులోనూ ఏఐ (కృత్రిమ మేధ) వచ్చాక టెక్నాలజీ నిపుణుల కోసం జరుగుతున్న 'స్టార్ హంట్' వేగం పుంజుకుంది. ఈ నేపథ్యంలోనే, మెటా- అదేనండీ, ఫేస్‌బుక్ సీఈవో జుకర్‌బర్గ్ 'సూపరింటెలిజెన్స్ టీమ్' పేరుతో స్వయంగా నియామకాలు మొదలుపెట్టాడు. ఈ టీమ్‌లో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు మన భారతీయ కుర్రాడు త్రపిత్ బన్సల్‌ది. రూ.800కోట్ల రూపాయలని జీతంగా ఆఫర్ చేసి త్రపిత్‌ని తన డ్రీమ్‌టీమ్‌లోకి తీసుకున్నాడు జుకర్. అంతగా ఇతనిలో ఏముందంటే... 35 ఏళ్ల త్రపిత్ ఐఐటీ కాన్పూర్ నుంచి డిగ్రీ అందుకున్నాడు. మసాచుసెట్స్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేశాడు. ప్రముఖ ఏఐ సంస్థ 'ఓపెన్ ఏఐ'లో రిసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేసిన అనుభవం ఉంది, ఓ- సిరీస్‌వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకోసం పనిచేశాడు. ఈ అర్హతలతోనే మెటా డ్రీమ్ టీమ్‌లో చేరిపోయాడు. త్రపిత్‌కే ఇంత జీతం ఉంటే, మరి ఈ డ్రీమ్‌టీమ్‌కి నాయకత్వం వహిస్తున్న అలెగ్జాండర్ వాంగ్ జీతం ఎంతో తెలుసుకోవాలని ఉంటుంది కదా! అతని జీతం పాతికవేల కోట్లపైమాటేనట. ఎంత ఏఐ అయినా ఏ సాంకేతికతా దానంతట అదే తయారైపోదుగా, దాన్ని నడిపించడానికీ నిపుణులు కావాలిగా... అలాంటి నిపుణుల బృందమే ఈ సూపరింటెలిజెన్స్ టీమ్. మానవమేధకంటే మెరుగ్గా ఆలోచించే, ఏఐ సేవలు అందించడమే ఈ డ్రీమ్ టీమ్ లక్ష్యమట.

సీ-సూట్లలో రాణిస్తూ...

ఒక్క టెక్నాలజీ నిపుణులుగానే కాదు... దిగ్గజ కంపెనీల్లో సీ-సూట్(సీఈఓ, సీఎఫ్ఓ, సీఓఓ), వీ-సూట్(వైస్ ప్రెసిడెంట్స్), డీ-సూట్ (డైరెక్టర్స్)లలోనూ సమర్థంగా రాణిస్తున్న భారతీయుల సంఖ్యా పెరుగుతోంది. వీళ్ల జీతాలూ ఏఐ నిపుణుల ప్యాకేజీలతో పోటీ పడుతున్నాయి. ఉదాహరణకి పాలోఆల్టో నెట్‌వర్క్ అనే సైబర్ సెక్యూరిటీ సంస్థకి సీఈఓగా ఉన్న నికేష్‌అరోరానే తీసుకుంటే... అతనిది పంజాబీ కుటుంబం. తండ్రి ఆర్మీలో పనిచేసేవాడు. నికేష్ ఆ దారిని ఎంచుకోకుండా, బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేసి ఆపైన అమెరికాలోని బోస్టన్ కాలేజీ నుంచి ఎంఎస్ ఫైనాన్స్ చేశాడు. ఆ తర్వాత గూగుల్‌లో కొంత కాలం పనిచేసి, ఆ అనుభవంతోనే పాలోఆల్టో నెట్‌వర్క్ సంస్థని సమర్థంగా నడిపిస్తున్నాడు. నికేష్ జీతం కాస్త అటుఇటుగా రూ.1250 కోట్లు. అత్యధిక జీతాలు అందుకుంటున్న భారతీయ పేర్లలో తాజాగా వినిపిస్తున్న మరో పేరు వైభవ్ తనేజా. ఎలాన్‌మస్క్‌కి చెందిన టెస్లా కార్ల కంపెనీ గురించి తెలుసుగా... ఆ కార్ల కంపెనీకి సీఎఫ్ఓ(చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్)గా ఉన్నది మరెవరో కాదు, ఈ దిల్లీ కుర్రాడు వైభవ్‌నే. ఇతని జీతం రూ.1200కోట్లట. దిల్లీ యూనివర్సిటీలో బీకామ్ చదివి, ఆపైన సీఏ చేసిన వైభవ్- అమెరికా వెళ్లి టెస్లాలో అత్యధిక జీతం అందుకుంటూ, సిలికాన్‌వ్యాలీ బోర్డురూమ్ సభ్యుల్లో ఒక్కడిగా మారాడు. ఇతని జీతం సుందర్‌పిచాయ్ కంటే ఎక్కువే అంటున్నాయి సిలికాన్‌వ్యాలీ కార్పొరేట్ వర్గాలు. ఎలాన్‌మస్క్ పెడుతున్న 'అమెరికన్ పార్టీ'లో ట్రెజరర్‌గా కూడా అవకాశం అందుకోనున్నాడట. వీళ్లే కాదు, టెక్ దిగ్గజం 'ఎన్విడియా'లో వరల్డ్ వైడ్ గ్లోబల్ ఆపరేషన్స్‌కి వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న అజయ్‌పురి రూ.185కోట్ల జీతం అందుకుంటుంటే, హాట్‌స్పాట్ అనే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సంస్థకి సీఈవోగా ఉన్న యామినీరంగన్ రూ.200 కోట్ల జీతాన్ని తీసుకుంటున్నారు. వెయిట్రెస్‌గా పనిచేసి, చాలీచాలని జీతంతో తొలిరోజులను నెట్టుకొచ్చిన యామిని కోయంబత్తూరు నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడ్డారు. ఇక ఎలక్ట్రిక్ వాహనాలకు బ్యాటరీలు తయారుచేసే క్వాంటమ్ స్కేప్ కంపెనీకి సీఈఓగా ఉన్న జగ్దీప్ సింగ్ సంపాదన అయితే ఒక్క రోజుకే రెండు కోట్లట. అయితే ఈ జీతాల్లో కొంతభాగాన్ని షేర్ల రూపంలో అందుకుంటే, కొంతభాగాన్ని సైనిన్ బోనస్‌లుగా కంపెనీలో అడుగుపెట్టే సమయానికే అందుకుంటారు. వీళ్ల జీతాల గురించి చదువుతుంటే- మన భారతీయులు ఎక్కడున్నా తోపులే అనిపించడమే కాకుండా, కొత్తతరానికి కోట్లలోనే స్ఫూర్తిని నింపుతున్నారు అనిపిస్తోంది కదూ! ★

సేవ చేయాలని ఉందా..!

వీలున్నప్పుడల్లా కనీసం ఒక్కరికైనా తోచిన సాయం చేయాలని ఉన్నా... ఎక్కడికి వెళ్లాలీ, ఎవరికి సాయం అందించాలనే విషయాలపైన స్పష్టత ఉండదు చాలా సందర్భాల్లో. అలాంటి మంచి మనసు ఉన్నవారిని ప్రోత్సహించేందుకే కొన్ని సంస్థలు ఉన్నాయిప్పుడు. ఇవెలా పనిచేస్తాయంటే...



ఒక్క పూట అన్నం పెట్టొచ్చు

పేదవాళ్లకు ఉన్నంతలో సాయం చేయాలనే తపన ఉన్నా కొందరికి ఆ కాస్త సమయం కూడా దొరక్కపోవచ్చు. పోనీ, ఏదో ఒక సంస్థకు డబ్బు పంపించి సంతృప్తి పడదామన్నా అది సరైనవారికి చేరుతుందో లేదోనని సందేహించే వారికోసమే 'దాగమ్ ఫౌండేషన్' అందుబాటులోకి వచ్చింది. చెన్నై చేట్‌పేటలో ఉండే ఈ సంస్థ ఇతర ఎన్జీఓలతో పోలిస్తే ఏదో ఒక్క సేవకే పరిమితం అవ్వదు. ఎవరైనా సరే... ఎక్కడి నుంచైనా తమకు తోచినట్లుగా ఈ సంస్థ ద్వారా పేదవాళ్లకు సాయం చేయొచ్చు. ఎలాగంటే.. పుట్టినరోజు సందర్భంగా ఒకరికి కేక్‌ను ఇవ్వడం నుంచీ ఓ వారం రోజులకు సరిపడా నిత్యావసరాలను అందించడం వరకూ... ఒక చిన్నారికి ఒక రోజుకు గుడ్డు, అరటిపండు, పాలు వంటివి ఇవ్వడం నుంచీ.. ఒక పూట భోజనం పెట్టించడం వరకూ... ఏదైనా చేయొచ్చు. స్కూలుబ్యాగు స్పాన్సర్ చేయడం, నెలకు అవసరమయ్యే శానిటరీప్యాడ్స్‌ను ఇవ్వడం, పేద రోగికి నెలవారీ మందులు కొనివ్వడం... ఇలా చేయాలనుకున్న సాయాన్ని బట్టి ఈ సంస్థకు డబ్బును యాభై రూపాయల నుంచి తోచినంత పంపిస్తే.. వలంటీర్లు మనం కోరినట్లుగా పేదవాళ్లకు ఆ వస్తువుల్ని అందిస్తారు. ఇంకా... అలా ఇచ్చే వస్తువులపైన సాయం చేసినవారి పేరు, అవసరం అయితే ఫొటోను కూడా ముద్రిస్తారు. ఇలా ఇప్పటివరకూ ఎంతోమంది పేదవారిని ఆదుకున్న ఈ సంస్థను రాజా మాన్‌సింగ్ అనే సేవామూర్తి ప్రారంభించాడు.





డబ్బు తీసుకోరు

అపాత్రదానం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదనే నినాదంతో ప్రారంభమైందే సేవాదీప్ సంస్థ. రెల్ఫర్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ సీఎస్ఆర్‌లో భాగంగా దీన్ని ఏర్పాటు చేసినా ఇది దేశవ్యాప్తంగా సేవలందిస్తుంది. అటు సేవ చేయాలనుకునే వారినీ, ఇటు ఎన్జీఓలనూ కలిపే వారధిలా పనిచేసే సేవాదీప్ ఎవరినుంచీ ఒక్క రూపాయి కూడా తీసుకోదు. బదులుగా ఎన్జీఓల అవసరాలు గుర్తించి వినియోగదారులు ఇవ్వాలనుకుంటున్న రకరకాల వస్తువుల్ని వాళ్లకు చేరవేస్తుంది. అలాగే కొందరు కేవలం పిల్లలు, వృద్ధులు, మహిళలు, నిరాశ్రయులు... ఇలా ఒక వర్గానికి మాత్రమే సాయం అందించాలనుకుంటారు. దేశవ్యాప్తంగా నిజాయతీగా పనిచేసే అలాంటి ఎన్జీఓలను గుర్తించి... ఆ వివరాలను తమ వెబ్‌సైట్‌లో ఉంచుతుంది సేవాదీప్. ప్రస్తుతం వెయ్యికి పైగా అలాంటి ఎన్జీఓల సమాచారాన్ని అందించే సేవాదీప్ పని అక్కడితోనే ఆగిపోదు. ఇళ్లకు వెళ్లి వస్తువుల్ని సేకరించడం, వాటిని ఎన్జీఓలకు పంపించడం మళ్లీ కస్టమర్లకు ఫీడ్‌బ్యాక్‌ను ఇవ్వడం వరకూ పూర్తిగా పారదర్శకంగా పనిచేస్తుంది.



వాడని వాటిని ఇచ్చేలా...

ఆటవస్తువుల నుంచి ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, దుస్తుల వరకూ అన్నింటినీ అవసరం లేదనుకున్నప్పుడు స్టోర్‌రూమ్‌కో లేదా అటకమీదకో చేర్చడం చాలామంది చేసేదే. అలాంటి వాటిని సేకరించి, వాటి అవసరం ఉన్న సేవా సంస్థలకు అందించేందుకు అందుబాటులోకి వచ్చిందే హ్యాపీసోల్స్. బెంగళూరు ప్రధానకేంద్రంగా పనిచేస్తున్నా... ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలోనూ శాఖలున్న హ్యాపీసోల్స్‌ను సోనిక కొవిడ్ సమయంలో ప్రారంభించింది. వాడని వస్తువుల తాలూకు వివరాలను ఈ నిర్వాహకులకు తెలియజేస్తే వలంటీర్లే ఇంటివద్దకు వచ్చి వాటిని తీసుకెళ్తారు. తర్వాత వాటిని ఎవరికి అందించారనేదీ తెలియపరుస్తారు. అంతేకాదు... పారదర్శకతతో పనిచేసే ఎన్జీఓలను గుర్తించి, ఆ జాబితాను సేవ చేయాలనుకునేవారికి అందిస్తుందీ సంస్థ. ఆసక్తి ఉన్నవారిని కోరుకున్న సేవా సంస్థతో కలిసి పని చేసేలా చూడటం, లేదా వీలున్నప్పుడల్లా కాస్త సమయం గడిపేలా ప్రోత్సహించడం.. వంటివెన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్న హ్యాపీసోల్స్... కాస్త బరువైన వస్తువుల్ని తీసుకెళ్లేందుకు ట్రక్కుల్లాంటివి ఎంచుకుంటే గనుక దాతల నుంచి నామమాత్రపు రవాణా ఛార్జీలు వసూలు చేస్తుంది.







ఏ వ్యాపారాన్ని అయినా మార్కెట్ కదలికలే శాసిస్తాయి. ఎంతగొప్ప సంస్థకైనా ఏదో ఒక దశలో అవరోధాలు ఎదురవుతాయి. ఆ ప్రతికూలతలు కుటుంబాన్ని ప్రభావితం చేయకూడదంటే... వ్యాపార సంపదనూ, కుటుంబ సంపదనూ వేరువేరుగా చూడాలి. కంపెనీకి కార్పొరేట్ కార్యాలయం ఉన్నట్టే, కుటుంబానికి ఫ్యామిలీ ఆఫీస్‌ను ఏర్పాటు చేసుకోవాలి. భారతీయ కుబేర కుటుంబాలు ఆ ప్రయత్నంలోనే ఉన్నాయి.

కుబేరుల కోసం... ఫ్యామిలీ ఆఫీస్!

తేన జీవితకాల కష్టం వృథాగా పోకూడదన్నది వ్యవస్థాపకుడి తపన. తామంతా రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టిన ఆస్తులు పదింతలు పెరగాలన్నది రెండోతరం కోరిక. తమ కుటుంబం సంప్రదాయ వ్యాపారాలకే పరిమితం కాకుండా, కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవాలన్నది మూడోతరం ఆకాంక్ష.

...అన్ని తరాల నమ్మకాన్నీ నిలబెట్టే బాధ్యతను ఫ్యామిలీ ఆఫీస్ తీసుకుంటుంది. ఇది కుబేరుల కుటుంబ కార్యాలయం. వయోజనులైన వారసులంతా ఇందులో సభ్యులే. ఆ ఆవరణలోనే పెట్టుబడులూ, న్యాయ సలహాలూ, వెంచర్ క్యాపిటల్ వ్యవహారాలూ... తదితర విభాగాలు ఉంటాయి. నిపుణులైన సిబ్బంది వాటిని పర్యవేక్షిస్తుంటారు. తరచూ సర్వసభ్య సమావేశాలు జరుగుతాయి. ఆ సందర్భంగా కొత్త ఇన్వెస్ట్‌మెంట్లూ, కొనబోతున్న ఆస్తులూ, సామాజిక బాధ్యతగా చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలూ... ఇలా అనేక విషయాలు చర్చకు వస్తాయి. అలా అని, మాటలకే పరిమితమైతే డైనింగ్ టేబుల్ కబుర్లకూ ఫ్యామిలీ ఆఫీస్ మీటింగులకూ తేడా ఏం ఉంటుంది? ఫ్యామిలీ ఆఫీస్‌కు పుష్కలమైన నిధులు ఉంటాయి. ఆ మొత్తం వందకోట్లు కావచ్చు, పదివేల కోట్లూ కావచ్చు. ఇప్పటికే ముంజల్, అదానీ, బర్మన్, ప్యాట్నీ, మారివాలా, రిలయన్స్, ఇన్ఫోసిస్, విప్రో, గోద్రెజ్... తదితర పరివారాలకు సకల సౌకర్యాలతో కుటుంబ కార్యాలయాలు ఉన్నాయి. జూలియస్ బేర్, ఈవై ఇండియా సంస్థల తాజా అధ్యయనం ప్రకారం... 2018లో యాభైలోపు ఉన్న భారతీయ ఫ్యామిలీ ఆఫీసుల సంఖ్య గత ఏడాది చివరి నాటికి మూడొందలకు చేరింది. ఈ ఆరేడు నెలల్లో ఇంకో పాతిక వరకూ కొత్తగా పుట్టుకొచ్చి ఉంటాయి. అమెరికా, చైనాల తర్వాత... కొత్త సంపన్నులు శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదే. ముందు నుంచీ అన్నీ కుటుంబ వ్యాపారాలే కాబట్టి, వ్యాపార సంపదనూ వ్యక్తిగత సంపదనూ వేరుచేసి చూడటం భారతీయులకు తెలియదు. దీంతో, ఫ్యామిలీ ఆఫీస్ అవసరమే లేకుండా పోయింది. కానీ, మారుతున్న పరిస్థితులూ మార్కెట్ అనిశ్చితులూ సంపన్నుల ఆలోచనల్ని పూర్తిగా మార్చేశాయి. కుటుంబ కార్యాలయాల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నాయి.

సంపద సంరక్షణకు...

పాత సంపన్నులకైనా, కొత్త కుబేరులకైనా... ఓ దశ తర్వాత సంపాదించినదాన్ని నిలబెట్టుకోవడమూ, వీలైతే మరింత అభివృద్ధి చేసుకోవడమూ ఓ సమస్యగా మారుతోంది. అలా అని, ప్రధాన వ్యాపారాల్ని పక్కన పెట్టి కుటుంబ లావాదేవీల మీదే దృష్టి సారించలేరు. దీంతో, ఫ్యామిలీ ఆఫీస్‌లాంటి ఓ వ్యవస్థ తప్పనిసరైంది. అందులోనూ, ఆర్థిక సరళీకరణ తర్వాత 'సిరి తావచ్చిన వచ్చును...' అన్నట్టు వివిధ మార్గాల్లో కుబేరుల ఖాతాల్లోకి డబ్బు వచ్చిపడుతోంది.

కొన్నిసార్లు... ఆ కుటుంబ వ్యాపారం ఏ బహుళజాతి సంస్థనో ఆకట్టుకుంటుంది. భాగస్వామ్యానికి ముందుకొస్తుంది. కాదనడానికి కారణం కనిపించదు. అలా, ఊహించనంత నగదు చేతికి అందుతుంది. ఆ సొమ్మును ఎలా సద్వినియోగం చేసుకోవాలి?

కొన్నిసార్లు... ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వల్ల కుటుంబ వాటాల విలువ అనూహ్యంగా పెరిగిపోతుంది. అందులో ఐదు శాతమో, పది శాతమో నగదు చేసుకున్నా వందలకోట్లు వచ్చిపడతాయి. అంత డబ్బును బ్యాంకు ఖాతాలో నిరుపయోగంగా ఉంచుకోలేరు. మరి, తక్షణ కర్తవ్యం?

కొన్నిసార్లు... తాతముత్తాతల కాలం నుంచీ భూములూ, స్థలాలూ, భవనాలూ, ఫిక్స్‌డ్ డిపాజిట్లూ.. తదితర రూపాల్లో సమకూర్చుకున్న ఆస్తిపాస్తుల్ని సురక్షితమైన మార్గాల్లో రేపటి తరాలకు అందించాలని కుటుంబ పెద్ద భావించవచ్చు. అదెలా అన్నది అసలు ప్రశ్న!

కొన్నిసార్లు... భవిష్యత్తు అవసరాల కోసం, వార్షిక లాభాల్లోంచి కొంత శాతాన్ని పక్కన పెట్టాలని వ్యాపార కుటుంబాలు తీర్మానిస్తాయి. అలా ఓ నాలుగైదేళ్ల నాటికి భారీ మొత్తం పోగవుతుంది. దాన్ని రెట్టింపు చేయడానికి ఓ వ్యూహం అవసరం అవుతుంది. ఆ చిట్కా ఎవరు చెబుతారు?

... ఈ సమస్యలన్నింటికీ ఫ్యామిలీ ఆఫీస్‌లో పరిష్కారం ఉంది. భారతీయ సంపన్న కుటుంబాలు సగటున ఐదొందల కోట్ల రూపాయల వరకూ ఫ్యామిలీ ఆఫీస్‌కు కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కుటుంబ కార్యాలయం పెట్టుబడుల విలువ పదివేల కోట్ల పైమాటేనని అంచనా. సభ్యుల తీర్మానం ప్రకారం... ఆ ఆఫీసులు అందుబాటులో ఉన్న నిధుల్ని షేర్స్, మ్యూచువల్ ఫండ్స్,

ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్, వెంచర్ క్యాపిటల్, రియల్ ఎస్టేట్ తదితర మార్గాల్లో మదుపు దిశగా మళ్లిస్తున్నాయి. కుటుంబం అంటేనే నమ్మకం. ఇంకెవరి కంపెనీలోనో డబ్బు పెట్టినప్పుడు దుర్వినియోగానికి ఆస్కారం ఉంటుంది. ఇక్కడ ఆ సమస్యే రాదు. కుటుంబ సంక్షేమం కోసం, కుటుంబ సభ్యులే ప్రతినిధులుగా ఏర్పాటైన వేదిక కాబట్టి, ప్రతి ఒక్కరిలోనూ 'మనదీ' అనే భావన ఉంటుంది. ఆ సమష్టితత్వమే ఫ్యామిలీ ఆఫీస్‌కు బలం.

ఇతర బాధ్యతలూ...

పెట్టుబడుల్ని పర్యవేక్షించడం ఒక్కటే అయితే ఒకరిద్దరు కన్సల్టెంట్లు సరిపోతారు. ఫ్యామిలీ ఆఫీస్ అవసరమే ఉండదు. నిజానికి, ఆ కార్యాలయం బాధ్యత ఇక్కడితో తీరిపోదు. సరిగ్గా ఇక్కడే మొదలవుతుంది. ఫ్యామిలీ ఆఫీస్... యాజమాన్యం ఆదేశాలతో వారసుల పైచదువుల కోసం పేరున్న విదేశీ విశ్వవిద్యాలయాల్ని ఎంపిక చేస్తుంది. నియమావళిని అనుసరించి, పిల్లల చదువులకు ఉమ్మడి ఖాతాలోంచి నిధులను సమకూరుస్తుంది. యాజమాన్యం కోరితే, సభ్యుల విదేశీ పౌరసత్వాల కోసమూ ప్రయత్నాలు చేస్తుంది. ఆధునిక జీవితాల్లో వివాహ బంధానికి భరోసా తగ్గుతోంది. ఇక కలిసి ఉండలేమనే ఆలోచన రావడమే ఆలస్యం, విడాకులకు సిద్ధపడుతున్నారు. ఆ వివాదాలు కోర్టుల వరకూ వెళ్తున్నాయి. భరణాల రూపంలో భారీ మొత్తాన్ని సమర్పించుకోవాల్సి వస్తుంది. దీనివల్ల కుటుంబ సంపద హారతి కర్పూరంలా కరిగిపోయే ప్రమాదం ఉంది. సమస్య అంత వరకూ రాకుండా... న్యాయ నిపుణుల సాయంతో యజమాని కుటుంబానికి చట్టపరమైన రక్షణ కవచాన్నీ నిర్మిస్తుంది. సభ్యుల వ్యాపార ప్రయాణాలకూ, విహార యాత్రలకూ ఏర్పాట్లు చేస్తుంది. ఎవరికైనా శత్రువుల నుంచో సంఘ విద్రోహక శక్తుల నుంచో ముప్పు ఉన్నప్పుడు, భద్రతా వ్యవహారాల్నీ పర్యవేక్షిస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య చిన్నాపెద్దా వివాదాలు తలెత్తినప్పుడు... కౌన్సెలర్ల సాయంతో అపోహల్ని తొలగించే ప్రయత్నం చేస్తుంది. ఆస్తుల విభజన అనివార్యం అయినప్పుడు, సదరు సభ్యుడికి తన వాటాకింద అందాల్సిన మొత్తాన్ని నయాపైసాతో సహా లెక్కగట్టి సెటిల్ చేస్తుంది. అవసరమైతే, అదుపు తప్పుతున్న ఖర్చుల గురించీ హద్దులు మీరుతున్న విలాసాల గురించీ కుటుంబ సభ్యుల్ని సున్నితంగా హెచ్చరిస్తుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ వ్యవహారాల్నీ ఈ కార్యాలయమే చూసుకుంటుంది. ఆ పరివారానికి కుటుంబ రాజ్యాంగం కనుక ఉంటే, దాని అమలు బాధ్యత కూడా ఫ్యామిలీ ఆఫీసుదే. అలా, యజమాని కుటుంబంలో ఒక సభ్యుడిలా కలిసిపోతుంది. నమ్మిన బంటులా వ్యవహరిస్తుంది.

కలల వేదిక...

ఇనుము-ఉక్కు, చక్కెర-సిమెంటు, ఎరువులు-రసాయనాలు... పాతతరం ఆలోచనలన్నీ ఇలాంటి తయారీ రంగాల చుట్టూనే తిరిగేవి. జెన్-జెడ్ మాత్రం భారీ పరిశ్రమల పట్ల పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కొత్త కంపెనీలు పెట్టి కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్ తదితర విభాగాల్లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఆరాటపడుతోంది. తండ్రులూ తాతలూ నిర్లక్ష్యం చేసిన స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ల వైపూ దృష్టి సారిస్తోంది. ఆ ప్రయత్నాలకూ, ప్రయోగాలకూ కుటుంబ కార్యాలయాలు సాయం చేస్తున్నాయి. 'ఫ్యామిలీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఫండ్' నుంచి ఇన్‌హౌస్ స్టార్టప్స్‌కు వనరులు సమకూరుస్తున్నాయి. ఆమాటకొస్తే, పాతతరం కూడా... సంప్రదాయ వ్యాపారాల నుంచి పూర్తిగా బయటికి రాకుండానే... వినూత్నమైన ఆలోచనల్ని ప్రోత్సహించాలని భావిస్తోంది. ఫ్యామిలీ ఆఫీస్ నేతృత్వంలోని వెంచర్ క్యాపిటల్ విభాగం ద్వారా బయటి అంకురాల్లో పెట్టుబడులు పెడుతోంది. ప్రేమ్‌జీ తన ఫ్యామిలీ ఆఫీస్ నిధుల నుంచి 'స్లైస్ కంపెనీ', 'మింటిఫై' లాంటి యాభైకి పైగా స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. హల్దీరామ్ కుటుంబ పెద్దలు క్విక్ డెలివరీ సంస్థ 'జెప్టో'కు నిధులు సమకూర్చారు. ఆనంద్ మహీంద్రా తన ఫ్యామిలీ ఆఫీస్ ద్వారానే పదహారు కంపెనీల్లో పెట్టుబడి పెట్టారు. ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్ ఫ్యామిలీ ఆఫీస్ ఏకంగా వందమంది ఆంత్రప్రెన్యూర్లకు అండగా నిలిచింది. నారాయణమూర్తి తన ఫ్యామిలీ ఆఫీస్... 'కాటమరాన్ వెంచర్స్' ద్వారా ఇప్పటి వరకూ రెండొందల కంపెనీల్లో పెట్టుబడులు పెట్టారు. అంబుజా సిమెంట్

అనేక రకాలు

ఫ్యామిలీ ఆఫీసులు మూడు రకాలు. మొదటిది సింగిల్ ఫ్యామిలీ ఆఫీస్. పేరుకు తగ్గట్టే, ఒకే కుటుంబానికి సంబంధించిన వ్యవహారాల్ని పర్యవేక్షిస్తుంది. సొంతంగా ఫ్యామిలీ ఆఫీస్ నిర్వహణ అంటే మాటలు కాదు. లక్షలకొద్దీ జీతాలతో నిపుణుల్ని నియమించుకోవాలి. సమావేశానికి హాజరైన ప్రతిసారీ కన్సల్టెంట్లకు భారీగా పారితోషికాలు ముట్టజెప్పాలి, కార్యాలయ నిర్వహణ వ్యయాలు ఉండనే ఉంటాయి. ఏటా పదిహేను నుంచి ఇరవై కోట్లు కేటాయించాల్సిందే. కనీసం వెయ్యి కోట్ల బడ్జెట్ ఉన్న పరివారాలే ఇంత ఖర్చును భరించగలవు. ఆ పరిమితిని అధిగమించడానికి పుట్టుకొచ్చిందే... మల్టీ ఫ్యామిలీ ఆఫీస్. ఒకే కార్యాలయంలో పదో పాతికో కుటుంబాల వ్యవహారాల్ని నిర్వహిస్తారు. దీనివల్ల ఆయా కుటుంబాలకు ఖర్చు తగ్గుతుంది. కాకపోతే, గోప్యతకు ఆస్కారం తక్కువ. వర్చువల్ ఫ్యామిలీ ఆఫీస్... ఇటీవలి కాలంలో ప్రచారంలోకి వచ్చింది. దీనికి ప్రత్యేకించి ఓ కార్యాలయం అంటూ ఉండదు. ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడు ఒకచోటా, న్యాయ నిపుణుడు ఒకచోటా, చార్టర్డ్ అకౌంటెంట్ ఒకచోటా ఉంటారు. ఆన్‌లైన్‌లోనే సేవలు అందిస్తారు. ఇది మరింత చవకైన మార్గం.

సెలెబ్రిటీలూ...

చాలామంది సినీ, క్రీడారంగ దిగ్గజాలకు కుటుంబ కార్యాలయాలు ఉన్నాయి. బిగ్-బి అమితాబ్ తన ఫ్యామిలీ ఆఫీసు ద్వారా అప్పట్లోనే 'జస్ట్ డయల్'లో ఇన్వెస్ట్ చేశారు. క్రౌడ్ ఫండింగ్ వేదిక 'కెట్టో'కూ నిధులు సమకూర్చారు. క్రికెటర్ యువరాజ్ సింగ్ 'యు వియ్ కాన్' పేరుతో ఫ్యామిలీ ఆఫీసును నిర్వహిస్తున్నారు. క్యాన్సర్‌పై పోరాటానికి ఇక్కడి నుంచి కూడా నిధులు వెళ్తాయి. దీపిక పదుకొణె, సచిన్ తెందూల్కర్, విరాట్ కోహ్లీ, హృతిక్ రోషన్‌ల కుటుంబ కార్యాలయాలూ చురుగ్గానే వ్యవహరిస్తున్నాయి. బాలీవుడ్‌లో అత్యంత ఖరీదైన ఫ్యామిలీ ఆఫీస్ షారుక్ ఖాన్‌దే కావచ్చు. ఆయన పెట్టుబడులు రియల్ ఎస్టేట్ సంస్థలకూ విస్తరించాయని మార్కెట్ వర్గాల సమాచారం.











మిడిల్‌క్లాస్ ఫార్ములా...

కుబేరుల సంపదలు వేలకోట్లలో ఉంటాయి. సామాన్యుల ఆస్తులు లక్షల్లోనో, ఒకట్రెండు కోట్లలోనో ఉంటాయి. కరెన్సీ లెక్కల్ని మినహాయిస్తే... కుటుంబం కుటుంబమే. ఎవరి ఇంట్లో అయినా భిన్నాభిప్రాయాలూ భేదాభిప్రాయాలూ తప్పవు. అక్కడక్కడా తోబుట్టువులు భాగస్వామ్య వ్యాపారాలూ చేస్తుంటారు. బిజినెస్ అన్నాక అపోహలకూ అనుమానాలకూ ఆస్కారం ఎక్కువే. ముఖ్య నిర్ణయాల్లో పారదర్శకత కోసం ఆ కుటుంబాలు ఫ్యామిలీ ఆఫీస్ ఫార్ములాను యథాతథంగా అన్వయించుకోవచ్చు. ఏ చిన్న సమస్య ఎదురైనా మనసు విప్పి మాట్లాడుకోవడం, ఏవైనా సందేహాలుంటే నేరుగా అడిగి తీర్చుకోవడం ... వ్యాపార, వ్యక్తిగత బంధాల బలోపేతానికి ఉపకరించే మార్గాలు. వీలైతే కుటుంబం నేతృత్వంలో పదిమందికీ ఉపయోగపడే మంచిపనుల్నీ చేపట్టవచ్చు. వ్యక్తిగా సమకూర్చుకోలేని పెద్ద ఆస్తుల్ని ఓ కుటుంబంగా సొంతం చేసుకోవచ్చు. కుటుంబ రాజ్యాంగాన్నీ రాసుకోవచ్చు.

వ్యవస్థాపకులు నరోతమ్ కుటుంబం ఏర్పాటు చేసుకున్న నరోతమ్ సెఖ్‌సరియా ఫ్యామిలీ ఆఫీస్ 'గరుడా ఏరోస్పేస్'కు మేమున్నామనే భరోసాను అందించింది. కుటుంబ కార్యాలయాల అండ లేకపోతే, ఇందులో సగానికి సగం అంకురాలు మొక్కగా ఉన్నప్పుడే రాలిపోయేవేమో. కొత్త కుర్రాళ్ల ఐడియాలోని మెరుపును గుర్తించి, ప్రాణవాయువులాంటి పెట్టుబడిని సమకూర్చడం ద్వారా ఫ్యామిలీ ఆఫీస్‌లూ బాగానే లాభపడుతున్నాయి. ఆయా స్టార్టప్స్ మార్కెట్ విలువ పెరిగేకొద్దీ వాటి సంపదా వృద్ధి చెందుతోంది. అప్పట్లో, దమానీల కుటుంబ కార్యాలయం నిధులు సమకూర్చిన విషయాన్ని 'ఓయో' రితేష్ అగర్వాల్ తరచూ గుర్తుచేసుకుంటూ ఉంటాడు. తనకంటూ ఓ జీవితాన్ని ఇచ్చిన ఫ్యామిలీ ఆఫీస్ వ్యవస్థ రుణం తీర్చుకునే ప్రయత్నం కావచ్చు, తానూ ఓ ఫ్యామిలీ ఆఫీస్‌ను ఆరంభించి అనేక అంకురాల్ని ప్రోత్సహిస్తున్నాడు రితేష్.

పగ్గాలు ఎవరికి?

వాణిజ్య రాజధాని కుబేరుల రాజధాని కూడా. అధికశాతం కుటుంబ కార్యాలయాలు ముంబయిలోనే ఉంటున్నాయి. హైదరాబాద్, పుణె, అహ్మదాబాద్, బెంగళూరు తదితర నగరాల నుంచి కూడా కొన్ని పనిచేస్తున్నాయి. ముకేశ్ అంబానీ ముంబయితోపాటు సింగపూర్‌లోనూ ఓ ఆఫీసు ఏర్పాటు చేశారు. అంబుజా కుటుంబానికి లండన్‌లో అంతర్జాతీయ కార్యాలయం ఉంది. నారాయణమూర్తి 'కాటమరాన్' రెండు విదేశీ ఆఫీసుల ద్వారా కూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ నిర్ణయమూ వ్యూహాత్మకమే. దేశీయ కార్యాలయాల్ని తమ కుటుంబానికి అనువైన చోట ఏర్పాటు చేసుకుంటున్నా, అంతర్జాతీయ ఆఫీసుల విషయానికి వచ్చేసరికి... విదేశీ పెట్టుబడులకు అనువైన ప్రాంతాలకే ఓటేస్తున్నారు. ప్రత్యేకించి కార్పొరేట్ పన్నుల బాదుడు తక్కువగా ఉన్న దేశాల్ని ఏరికోరి ఎంచుకుంటున్నారు. ఒక్క సింగపూర్‌లోనే విశ్వ సంపన్నులకు చెందిన ఏడెనిమిది వందల ఫ్యామిలీ ఆఫీసులు ఉన్నట్టు అంచనా. గాంధీనగర్-అహ్మదాబాద్‌ల నడుమ నిర్మించిన... గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ (గిఫ్ట్ సిటీ) సింగపూర్‌ను మించిన సౌకర్యాలతో, ఆకట్టుకునే పన్ను మినహాయింపులతో మన దేశంలోనే కుటుంబ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. ఇక, ఫ్యామిలీ ఆఫీసుల నిర్వహణ విషయానికొస్తే... కొన్ని కుటుంబాలు పూర్తిగా నిపుణులకే వదిలేస్తున్నాయి. నారాయణమూర్తి ఆ బాధ్యతను దీపక్ పడాకి అనే ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడి చేతిలో పెట్టారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఆశీర్వాద్ పైప్స్ వ్యవస్థాపకుల కుటుంబం... తమ పరివారానికే చెందిన యశ్ పోద్దార్‌కు సర్వాధికారాలూ కట్టబెట్టింది. 'ఓ బెల్జియం కంపెనీకి వాటాలు విక్రయించడం వల్ల మాకు పెద్దమొత్తంలో నగదు లభించింది. అప్పుడే, కుటుంబ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. మరింత సమాచారం కోసం నిపుణులతో మాట్లాడాను. పాశ్చాత్య దేశాల్లో ఫ్యామిలీ ఆఫీసులు ఎలా పనిచేస్తున్నాయన్నదీ తెలుసుకున్నాను. అక్కడ వందేళ్ల నుంచే ఈ వ్యవస్థ ఉంది' అంటారు యశ్. జాగరణ్ గ్రూప్ ఫ్యామిలీ ఆఫీసును కూడా ఆ కుటుంబానికే చెందిన ఆర్తీ గుప్తా పర్యవేక్షిస్తున్నారు. తను ఐఐటీ-కాన్పూర్‌లో చదువుకున్నారు. మొదట్లో, సెలవులకు ఇంటికొచ్చినప్పుడు తండ్రి వ్యక్తిగత పెట్టుబడుల్ని సమీక్షించేవారు. ఆ తర్వాత, కుటుంబ సభ్యుల సూచనతో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని, ఉమ్మడి సంపదకు సంరక్షకురాలిగా మారారు. కొటక్ గ్రూప్ ఫ్యామిలీ ఆఫీసు... యూఎస్‌కే క్యాపిటల్‌ను ఆ కుటుంబ వారసుడు ఉదయ్ కొటక్ స్థాపించారు. తనే నిర్వహిస్తున్నారు.

చాలా ఫ్యామిలీ ఆఫీసులకు అనుబంధంగా దాతృత్వ విభాగాలు పనిచేస్తున్నాయి. క్రిస్ గోపాలకృష్ణన్ తన కుటుంబ కార్యాలయం 'ప్రతీక్ష' ద్వారా మెదడు పనితీరుపైన లోతైన అధ్యయనాలు చేపట్టడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు రెండువందలా యాభై కోట్ల రూపాయల విరాళం ప్రకటించారు. విప్రో అధినేత ఫ్యామిలీ ఆఫీస్ నుంచి కూడా దాతృత్వ కార్యక్రమాలకు పెద్దమొత్తంలో నిధులు వెళ్తాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి టెన్త్, ఇంటర్ పాసైన రెండున్నర లక్షలమంది బాలికలకు పెద్ద చదువుల కోసం రూ. 30 వేల చొప్పున ఆర్థిక సాయం చేయనున్నట్టు ప్రేమ్‌జీ ప్రకటించారు. నారాయణమూర్తి తన కాటమరాన్ లాభాల్లో కొంత శాతాన్ని ఫౌండేషన్‌కు మళ్లిస్తారు. ఫ్యామిలీ ఆఫీసులు తీసుకుంటున్న ఆ చొరవ అనేక నిరుపేద కుటుంబాల కష్టాలు తీరుస్తోంది.

★ ★ ★

డబ్బు మహా చెడ్డది... కుటుంబాన్ని విడదీస్తుందని అంటారు. అదే డబ్బు ఇక్కడ తరాలపాటూ కలిపి ఉంచుతోంది. కలిసి ఎదిగేలా ప్రోత్సహిస్తోంది. వ్యక్తులుగా వేరువేరు ఆలోచనలు ఉన్నా, కుటుంబంగా ఒక లక్ష్యం కోసం పనిచేయడం సాధ్యమేనని నిరూపిస్తోంది. ఫ్యామిలీ ఆఫీస్ సృష్టిస్తున్న అత్యంత విలువైన సంపద ఇదే! ★



శ్రీవారి దర్శనానికి దారులెన్నో!

ఆ ఏడుకొండలవాడి దర్శనభాగ్యం అంత సులువుగా దొరుకుతుందా... తలచుకోగానే వెళ్లాలంటే అందరికీ కుదురుతుందా... అందుకే కలియుగదైవాన్ని కళ్లారా చూసి తరించేందుకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం ఎన్నో రకాల దర్శన మార్గాల్ని అందుబాటులో ఉంచింది. వాటిల్లో ముందుగా టికెట్లు బుక్ చేసుకోకపోయినా, గంటల తరబడి క్యూలైన్లో వేచిచూడాల్సిన పని లేకుండా దర్శనాన్ని సులభతరం చేసే మార్గాలూ ఉన్నాయి!



తిరుపతికి వెళ్లాలి అనుకునేవాళ్లు చాలావరకూ ముందుగా ప్లాన్ చేసుకునే బయలుదేరుతారు. రోజూ దాదాపు లక్ష మంది భక్తులతో కిటకిటలాడే తిరుమలకి ఎటువంటి దర్శన టోకెన్లూ లేకుండా వెళితే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. స్వామిని దర్శించుకోవాలంటే గంటలకొద్దీ క్యూలో ఉండాల్సి వస్తుంది. అలాంటి సందర్భాల్లో దేవస్థానం అందుబాటులో ఉంచిన అన్ని రకాల దర్శన మార్గాల్నీ పరిశీలించొచ్చు. అందరికీ తెలిసిన సర్వదర్శనం, దివ్య దర్శనం, టీటీడీ వెబ్‌సైట్ ద్వారా జారీ చేసే ఎస్ఈడీ, ఆర్జిత సేవల టికెట్లతోపాటు ప్రత్యేకమైన ఆ సేవలేంటో చూస్తే...

★ అప్పటికప్పుడు తిరుపతికి వెళ్లాలనుకున్నా ఆన్‌లైన్లో టికెట్లు దొరక్కపోతే శ్రీవారి దర్శనానికి సమయాన్ని నిర్దేశిస్తూ జారీచేసే ఉచిత దర్శన టోకెన్లను ప్రయత్నించొచ్చు. రోజూ తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌ల్లో వీటిని జారీచేస్తారు. భక్తులు క్యూలైన్లో తమ ఆధార్‌కార్డును చూపించి, ఈ టోకెన్లను పొందొచ్చు.

★ చిన్న పిల్లలున్న వారికి ప్రత్యేక కోటా ఉంది. ఏడాది లోపు పిల్లలున్న తల్లిదండ్రులకు సుపథం మార్గంలో ఉచిత దర్శనాన్ని కల్పిస్తారు.

★ వృద్ధులూ, దివ్యాంగుల కోసం ఆన్‌లైన్లో రోజుకు 750 టికెట్లు ఇస్తారు.

★ అనారోగ్యంతో ఉన్న వారిని బయోమెట్రిక్ ద్వారం నుంచి లోపలికి పంపుతారు. ఈ విషయాన్ని ముందుగా వైకుంఠం-1 దగ్గరున్న టికెట్ తనిఖీ సిబ్బందికి తెలియజేయాలి.

★ భారత సైన్యంలో పనిచేసేవారికి (ఫీల్డ్‌స్టాఫ్) రూ.300 టికెట్ నేరుగా ఇస్తారు.

★ తితిదేకి చెందిన అశ్విని ఆసుపత్రిలో రక్తదానం చేసిన వారికి సుపథం మార్గంలో ప్రవేశం కల్పిస్తారు. రోజుకు అయిదుగురికి మాత్రమే ఈ అవకాశం ఉంటుంది.

★ తిరుపతిలోని అలిపిరి దగ్గరున్న సప్తగోప్రదక్షిణ మందిరంలో శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం నిర్వహిస్తారు. దీనికి రూ.1000 చెల్లించి టికెట్ తీసుకోవాలి. హోమం తర్వాత అక్కడి అధికారి స్టాంప్ వేసి ఇస్తే ఇద్దరికి రూ.300 టికెట్లు ఇస్తారు.

★ శ్రీవారి దర్శనానికి వచ్చే విదేశీయులకూ, ప్రవాస భారతీయులకూ ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉంటుంది. భారత్ నుంచి తిరుగు ప్రయాణం నెలలోపు ఉంటే పాస్‌పోర్టులో ఆ తేదీనీ, ఇమిగ్రేషన్ స్టాంపునీ చూపిస్తే రూ.300 టికెట్ ఇస్తారు.

★ ఆంధ్రప్రదేశ్ నాన్‌రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) ద్వారా వీఐపీ బ్రేక్ దర్శనాల్ని అనుమతిస్తారు. రోజుకు వందమందికి ప్రవేశం ఉంటుంది. ప్రవాసాంధ్రులు దీనికి అర్హులు.

★ తిరుమలలో కల్యాణం చేసుకున్న వధూవరులకూ, వారి కుటుంబ సభ్యులకూ కల్యాణోత్సవం టికెట్లను ఇస్తారు. ఇందుకు వివాహ ధ్రువీకరణ పత్రాన్నీ, ఫొటోలనూ చూపించాలి. తెలుగురాష్ట్రాల్లో ఏ ప్రాంతంలో పెళ్లి చేసుకున్న నవదంపతులైనా కూడా ఈ ప్రత్యేక దర్శనం చేసుకోవచ్చు.



★ శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టుకు రూ.10 వేలు విరాళమిచ్చి, రూ.500 చెల్లించి టికెట్ తీసుకునే భక్తులకు శ్రీవాణి దర్శన టికెట్లను ఇస్తారు. 1500 శ్రీవాణి టికెట్లలో ఆన్‌లైన్లో 500, తిరుపతి విమానాశ్రయంలో 200, తిరుమల జేఈవో కార్యాలయం వెనకున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రంలో 800 టికెట్లు ఇస్తారు.

★ ఏపీ, తెలంగాణ శాసనసభ-శాసనమండలి సభ్యులూ, లోక్‌సభ-రాజ్యసభ సభ్యులూ ఇచ్చే సిఫారసు లేఖలతో వీఐపీ బ్రేక్ దర్శనంతోపాటు వసతి సదుపాయం కల్పిస్తారు. అదేవిధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సిఫారసు లేఖలతోనూ ఈ అవకాశం దొరుకుతుంది. రోజుకు దాదాపు 4000 వరకు ఈ టికెట్లను జారీచేస్తారు. విచక్షణ కోటా కింద జారీ చేస్తారు కాబట్టి ముఖ్యమైన ఉత్సవాలూ, భక్తుల రద్దీ సమయాల్లో వీటిని రద్దు చేసే అధికారం తితిదేకు ఉంది.

★ శ్రీవారికి విరాళాలు అందించే దాతలకూ తితిదే ప్రత్యేక దర్శనాలకు అనుమతిస్తోంది. ఇందులో రూ.లక్ష నుంచి రూ.కోటిన్నర వరకూ విరాళాలను అందించిన వారికి డోనర్ పుస్తకాన్ని ఇస్తారు. కుటుంబంలోని అయిదుగురికి ఈ దర్శనభాగ్యం కలుగుతుంది.

★ యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్నీ, సనాతన ధర్మంపైన అనురక్తినీ కల్పించడమే లక్ష్యంగా గోవిందనామకోటిని తితిదే ప్రవేశపెట్టింది. గోవిందనామకోటి రాసిన యువతకు వీఐపీ దర్శనం చేసుకునే అవకాశాన్నిస్తోంది. 25 లేదా అంతకంటే తక్కువ వయసున్న వాళ్లు ఇందుకు అర్హులు.

–కొల్లా వెంకటేష్, న్యూస్‌టుడే, తిరుమల



శాటిన్ బట్ట చూడ్డానికి ఎంత బాగుంటుందో, తినడానికి అంతకు రెట్టింపు బాగుంటుంది. ఇక క్రేప్, షిఫాన్ అయితే నోట్లో ఇట్టే కరిగిపోతాయి. కంగారు పడకండి, మీరు సరిగానే వింటున్నారు... మనం చెప్పుకుంటున్నది కట్టుకునే బట్టల గురించి కాదు, తినే 'ఎడిబుల్ సిల్క్' గురించి. నోరూరించే ఆ 'ఎడిబుల్ ఫ్యాబ్రిక్' విశేషాలే ఇవి...

తినే సిల్క్... యమ్మీ యమ్మీ!

మనం బట్టల దుకాణానికి వెళ్తే ఏం చేస్తాం? 'బాబూ ఆ మెటీరియల్ చూపించు, ఈ మెటీరియల్‌లో వేరే రంగు ఉందా?', 'ఈ సిల్క్ చీర భలే ఉందే', 'ఈ కలర్ డెనిమ్ ప్యాంటు నాకు బాగా నప్పుతుంది'... ఇలా సాగుతాయి మన మాటలు. క్రేప్, షిఫాన్, డెనిమ్, శాటిన్, సిల్క్ వంటివన్నీ మనం కట్టుకునేందుకు వాడే వివిధ రకాల వస్త్రాలు. ఇవే మెటీరియల్స్ తినడానికి కూడా దొరుకుతున్నాయంటే ఆశ్చర్యంగానే ఉంటుంది. ఇవి చూడ్డానికి మాత్రమే అలా ఉంటాయనుకుంటే పొరపాటే... అవును, వీటిని తాకి చూసినా- అచ్చంగా వస్త్రాన్ని తాకినంత మెత్తగా, మృదువుగా ఉంటాయి. అవసరం అయితే బట్టలు మడత పెట్టినట్టుగా మడతపెట్టేయొచ్చు... అంత ఫ్లెక్సీబుల్‌గా ఉంటాయి. ఇక రుచిలోనూ అద్భుతంగానే ఉంటాయి. క్రేప్‌ని కరకరలాడించేయొచ్చు, శాటిన్‌ని నమిలి మింగేయొచ్చు, డెనిమ్‌ని చప్పరించేయొచ్చు.

కోరుకున్న రంగూ, వివిధ రకాల ప్రింట్లలో దొరికే ఈ ఎడిబుల్ సిల్క్‌తో ఉపయోగాలేంటీ అనేగా మీ సందేహం... అదీ తెలుసుకుందాం.

అదనపు అందం అద్దేస్తూ...

మనసులోని మాటని చెప్పి అందంగా ప్రపోజ్ చేయడానికో కేక్, పెళ్లై పదేళ్లయిన వేడుకని పురస్కరించుకుని మరో కేక్, పుట్టినరోజు కోసం ఒక కేక్... ఇలా సందర్భం ఏదైనా సెలబ్రేట్ చేసుకోవడానికి ముందుగా గుర్తొచ్చేవి కేక్‌లే. తియ్యని ఆ కేక్‌లని వీలైనంత అందంగా చూపించడానికి ఇప్పటివరకూ వచ్చిన అలంకరణలకి లెక్కేలేదు. ఇక రియలిస్టిక్ కేకులూ, ఫాండంట్ కేకుల గురించి చెప్పేదేముంది? థీమ్ ఏదైనా... కోరుకున్న ఆకృతిలోకి ఇట్టే ఒదిగిపోయి వావ్ అనిపిస్తాయి. వెడ్డింగ్ థీమ్, పుట్టినరోజు థీమ్‌లు చేసేటప్పుడు కేక్‌లపైన టాపర్‌లుగా ఉంచే బొమ్మలని ఐసింగ్ షుగర్‌తోనే చేయాలి. లేదంటే ప్లాస్టిక్‌లాంటివాటిని వాడాలి. అలాగే ఆ బొమ్మలకి వాడే దుస్తులూ, రిబ్బన్లూ, బౌలూ కూడా అంత సహజంగా అనిపించవు, పైగా కాసేపటికి గట్టిపడి విరిగిపోతాయి, కేక్ అందమంతా పోతుంది. అలాంటి సమస్యలు రాకుండా కేక్‌కి అదనపు అందాన్నీ, సహజత్వాన్నీ తీసుకురావడంలో ఈ ఎడిబుల్ ఫ్యాబ్రిక్స్ ఉపయోగపడతాయి. రైస్‌పేపర్లూ, ఐసింగ్ వేఫర్లూ, ఎడిబుల్ ఇంక్, అగర్‌అగర్ వంటివాటితో తయారుచేసిన ఈ ప్రత్యేకమైన ఫ్యాబ్రిక్స్- కేక్ ఎక్కువ రోజులు నిల్వ ఉండేట్టూ చేస్తాయట. ఎవిల్‌కేక్‌జీనియస్.కామ్, ఫ్లెక్సీక్యూ వంటి సంస్థలు ఈ ఎడిబుల్ ఫ్యాబ్రిక్స్‌నీ, వాటికి అదనపు అందాన్ని తీసుకొచ్చే బంగారు, వెండి రంగుల్లో ఉండే లేసులనీ, రిబ్బన్లనీ రెడీమేడ్‌గా అందిస్తున్నాయి. కొంతమంది కేక్‌లవర్స్ అయితే రైస్‌పేపర్, గ్లిజరిన్, ఐసింగ్‌వేఫర్ల సాయంతో ఇంట్లోనే ప్రయత్నిస్తూ సంబరపడుతున్నారు. కేరళకు చెందిన అనా ఎలెజిబెత్ జార్జ్ అనే అమ్మాయి వాళ్ల సంప్రదాయ కసవూ చీరని పోలిన ఎడిబుల్ చీరని తయారుచేసి కట్టుకుని కూడా చూపించింది. ఆసక్తి ఉంటే మీరూ మీకు నచ్చిన ఎడిబుల్ క్లాత్‌ని తయారుచేసేయొచ్చు! ★







వరాలతల్లికి వేవేల దండాలు!

క్షీరసాగర కన్యగా ఉద్భవించి, శ్రీమహావిష్ణువుని పరిణయమాడిన ఆ శ్రీమహాలక్ష్మి... సర్వ మానవాళి కోరికలు తీర్చడానికి అష్టరూపాల్లో కొలువుదీరింది. సంపదలిచ్చే ఆదిలక్ష్మి, ఆకలి తీర్చే ధాన్యలక్ష్మి, మనోబలాన్నిచ్చే ధైర్యలక్ష్మి, సంతానాన్ని ప్రసాదించే సంతానలక్ష్మి, జ్ఞానాన్ని పెంచే విద్యాలక్ష్మి... ఇలా భక్తుల్ని అనుగ్రహించడానికి ఎనిమిది అవతారాలెత్తిన దేవి- శ్రావణ మాసంలో ఏకరూపంలో వరలక్ష్మిగా పూజలు అందుకుంటుంది. మనసావాచా అమ్మవారిని కొలుస్తూ, ముచ్చటగా ఆ తల్లిని అలంకరించి ఈ ఏడాది వరలక్ష్మీవ్రతాన్ని జరుపుకుందాం, ఆ మహాలక్ష్మి కృపా కటాక్షం అందుకుందాం!

సాక్షాత్తూ లక్ష్మీదేవే!

ప్రసన్నవదనంతో శోభాయమానంగా వెలుగులీనే అమ్మవారి ముఖాన్ని చూడగానే మనసారా దండం పెట్టేయాలనిపిస్తుంది భక్తులందరికీ. ఆ అనుభూతిని పొందడానికే వరలక్ష్మీ వ్రతాల్లోనూ సాక్షాత్తూ అమ్మవారే నట్టింట్లోకి దిగి వచ్చిందా అన్నట్టుగా విగ్రహాలనూ, ముఖాలనూ ఎంచుకుంటారు గృహిణులందరూ. శ్రావణమాసపు పూజలూ, నోముల్లో ఆ శోభను తీసుకొస్తూనే ఏటా లక్ష్మీదేవి బొమ్మలూ వస్తున్నాయి. ఒకప్పుడు రంగులతో, మెరిసే రాళ్లతో దిద్దిన నగల అలంకరణలతో ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత వెండీ, బంగారాలవి పూజకు లక్ష్మీకళను తెచ్చాయి. ఇక ఇప్పుడేమో పచ్చలూ, కెంపులతో బంగారు ధగధగల నగలతో అమ్మవారిని ఎంతో అందంగా అలంకరిస్తున్నారు. తలపైన కిరీటం, ముక్కు పుడక, చెవి కమ్మలూ, హారాలతో వస్తున్న ఈ దేవీరూపాలు ఆలయంలోని దేవేరిని తలపిస్తున్నాయి!

లక్ష్మీ కలశం!

సకల సంపదలకు అధినాయకిగా ఆరాధించే లక్ష్మీదేవి పూజలో బంగారూ, వెండీ బిళ్లలతోపాటు ఆ తల్లికి స్వరూపంగా చిల్లర నాణేల్నీ అమ్మవారి ముందు రాశులుగా పోస్తుంటారు, కలశాల్లో నింపుతుంటారు. అమ్మవారి ముందు ఉంచిన ఈ ధనంతో అష్టైశ్వర్యాల అనుగ్రహం కలుగుతుందని నమ్ముతూ భక్తితో వేడుకుంటారు. అలా పెట్టాలంటే చిల్లర డబ్బుల్ని ముందుగానే సేకరించి పెట్టుకోవాలి. కానీ ఇప్పుడు ఆ అవసరమూ లేకుండా నేరుగా నాణేలతో నిండిన కలశాలే వస్తున్నాయి. బంగారూ, వెండీ మెరుపులతో నాణేల అచ్చులతో దొరుకుతున్న ఈ కాయిన్ కలశం- ఓ చక్కటి అలంకరణ కూడా!







అందాల ఎల్ఈడీ కుందులు!

బంగారు తళుకులీనే పీఠం వేసి, అమ్మవారి విగ్రహాన్ని ఉంచి, వర్ణరంజితమైన పూల అలంకరణ చేసినా- దీపాల్ని వెలిగిస్తేనే ఆ పూజా కార్యక్రమానికి అసలైన ఆధ్యాత్మిక శోభ వస్తుంది. పరమాత్ముడికి ప్రతిరూపంగా చెబుతూ దీపారాధన చేయడం అనేది మన సంప్రదాయం కూడా. కొంతమంది నూనెతో దీపాల్ని వెలిగించడంతోపాటు, ఆ వెలుగుల్ని అలంకరణలోనూ భాగం చేస్తుంటారు. రకరకాల ఎల్ఈడీ లైట్లనీ దేవుళ్ల చుట్టూ పెడుతుంటారు. మట్టి ప్రమిదల నుంచి వెండి కుందుల వరకూ ఎన్నో రకాల దీపాలు దొరుకుతున్నట్టే ఈ ఎల్ఈడీ లైట్లలోనూ ప్రత్యేకంగా పూజకు సంబంధించినవీ వచ్చాయి. అందమైన డిజైన్లూ, మెరిసే నగిషీల ఈ ఎల్ఈడీ దీపాల్ని పూజా డెకరేషన్లో పెట్టారంటే- సంప్రదాయ దీపాల్లానే కనిపిస్తాయి, పైగా రోజంతా నూనె పోయాల్సిన అవసరం లేకుండానే వెలుగులీనుతాయి!



మహాలక్ష్మి వస్త్రం!



పూజల్లో, శుభకార్యాల్లో కలశారాధనకీ ఎంతో విశిష్టత ఉంది. కలశాన్ని త్రిమూర్తులుగా భావిస్తూ... 'కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్రస్సమాశ్రితః, మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృగణాః స్మృతాః' అంటూ పూజిస్తారు. వరలక్ష్మీ వ్రతాల్లోనూ కలశాన్ని నీటితో నింపి, దాని మీద కొబ్బరికాయ పెట్టి, పైనుంచి కొత్త వస్త్రాన్ని చుడతారు. దానిపైన కొందరు సింగారించి సిద్ధం చేసిన మహాలక్ష్మి ముఖాన్ని పెట్టుకుంటారు. కానీ ఇప్పుడు వస్త్రం మీదే దేవీ చిత్రం వస్తోంది. కొబ్బరికాయ మీద చుట్టిన వస్త్రం మీదే సిరుల తల్లి దర్శనమిస్తోంది. దీంతో విడిగా మహాలక్ష్మి ముఖాల్ని ఉంచాల్సిన పనే ఉండదు. సమయం లేకపోయినా, అలంకరణ చేయడంలో అంత నేర్పు లేకపోయినా ఆభరణాలతో అందంగా వరలక్ష్మి ముఖచిత్రాలతో వస్తున్న ఈ వస్త్రాన్ని కొబ్బరికాయకు చుట్టేయొచ్చు.



ముస్తాబైన పసుపు-కుంకుమ!

సౌభాగ్యానికి ప్రతీకలైన పసుపు-కుంకుమలు లేకుండా పూజలూ, శుభకార్యాలూ జరగవు. వాటికున్న ఆ ప్రాముఖ్యత వల్లే పండుగలూ వేడుకల్లో అతిథులకిచ్చే వాయనాల్లోనూ, రిటర్న్ గిఫ్టుల్లోనూ అవి తప్పనిసరి. ఒకప్పుడు కాగితపు పొట్లాల్లో పెట్టి ఇచ్చే ఆ పసుపు-కుంకుమలు తర్వాత మన సౌకర్యాన్ని బట్టి ప్యాకెట్లలో వచ్చాయి. ఇక ఇప్పుడైతే వేడుక సందర్భాన్ని బట్టి వీటిని తయారుచేస్తున్నారు. పూజలకు లక్ష్మీదేవి చిత్రాలతో, సీమంతం కోసం గర్భిణుల బొమ్మలతో... ఇలా వేడుకకు తగ్గట్టు వస్తున్నాయి. ప్రతిదాంట్లో కాస్త ప్రత్యేకతనూ, మరికాస్త అభిరుచినీ చూపాలనుకునేవాళ్లకి ఇవి చక్కటి ఎంపిక!

దీపాల్లో సిరుల తల్లి!

'నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే, శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మీ నమోస్తుతే' అంటూ వరలక్ష్మిని స్తుతిస్తూ పూజ మొదలుపెడతాం. వెనక కట్టే తెర దగ్గర్నుంచీ రంగవల్లిక, హారతిపళ్లెం, కుంకుమభరిణె... ఇలా సర్వం దేవి రూపాల్లోనే అలంకరిస్తుంటాం. అందుకు తగ్గట్టు ఆ పూజ కళ అన్నింట్లో కనిపించేట్లు సామగ్రి అంతా దొరుకుతోంది. కొంతమంది దేవిని పట్టుచీరతో ముస్తాబు చేసినట్టే, లక్ష్మీనారాయణుల స్వరూపంగా భావిస్తూ దీపాల కుందులనూ చీర కుచ్చిళ్లతో సింగారిస్తుంటారు. ఆ పద్ధతిని సులువు చేస్తూ అమ్మవారి ముఖాలతో లక్ష్మీ నారాయణ ల్యాంప్ డెకార్స్ వచ్చాయి. ఇది వరకు వాటితో అలంకరించిన దీపాలే అందుబాటులో ఉంటే- ఇప్పుడు ఇంట్లోని ఏ కుందులకైనా వాటిని కట్టుకునేలా తీర్చిదిద్దారు ఈ ల్యాంప్ డెకార్స్‌ని.



అలంకరణ తేలిగ్గా!



పూజాకార్యక్రమాల్లో గృహిణులందరూ ఎనలేని భక్తిశ్రద్ధల్నే కాదు, తమదైన అలంకరణ నైపుణ్యాన్నీ చూపిస్తుంటారు. తమ ఇంటి శ్రావణలక్ష్మికి సరికొత్త శోభ తీసుకురావడానికి ఎవరికివారు ప్రయత్నిస్తుంటారు. కానీ బిందె మీద అమ్మవారి ముఖాన్ని పెట్టి, చీరకట్టుతో లక్ష్మీదేవి పూర్తి రూపాన్ని సిద్ధం చేయడం అంటే అనుకున్నంత చిన్న పని కాదు. అందుకు చాలా సమయం వెచ్చించాల్సి ఉంటుంది. ఆ ఇబ్బందిని తప్పించడానికే వరమహాలక్ష్మి పూజా స్టాండ్లూ, లక్ష్మీ బిందెలూ వచ్చాయి. వీటిసాయంతో దేవి రూపాన్ని తయారుచేసుకుని సులువుగా అలంకరించుకోవచ్చన్నమాట!




వాయనాల ముద్దుగుమ్మలు!



ఏ పూజ చేసినా... వచ్చిన ముత్తయిదువులకు వాయనం ఇవ్వడమన్నది మన సంప్రదాయం. పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క, గాజుల్ని అందించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. ఇలా నిండు మనసుతో వాయనం ఇస్తే- లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందనేది భక్తుల నమ్మకం. భక్తి శ్రద్ధలతో పాటు, పూజా కార్యక్రమాన్ని ప్రత్యేకంగా జరుపుకోవాలనుకునే అతివలు వాయనాల్లోనూ తమ అభిరుచిని చూపిస్తున్నారు. అలాంటి వారికోసమే జాకెట్టు ముక్కలూ, గాజుల్నే అందమైన కుందనపు బొమ్మల్లా తీర్చిదిద్దుతున్నారు. ముస్తాబైన అమ్మాయిల ముఖాల ఫొటోల్ని ఉంచి, రంగుల జాకెట్లను దుస్తులుగా మలిచి, వాటి మీద గాజుల్ని పెడుతున్నారు. కాస్త ఓపికా, సృజనా ఉంటే మీరే సొంతంగా ఈ బొమ్మల్ని తయారుచేసుకోవచ్చు. వరుసలో పెట్టిన ఈ జాకెట్ల వాయనాలు కూడా పూజకొచ్చిన ముత్తయిదువుల్లా కనిపిస్తూ- ఎంత ముద్దొస్తాయో!



ఇవేకాదు, పూజలూ, వ్రతాలూ, నోములూ, వాయనాలతో కళకళలాడిపోయే ఈ శ్రావణమాసానికి అలంకరణలతోనూ ఆధ్యాత్మిక వన్నెలు అద్దడానికి మార్కెట్లో సరికొత్త పూజాసామగ్రి దొరుకుతోంది. ఈసారి వరలక్ష్మీవ్రతంలో వాటిని భాగం చేసుకుంటూ 'రావమ్మా! మహాలక్ష్మీ రావమ్మా, ఈ కోవెల నీ ఇల్లు కొలువై ఉందువుగానీ' అంటూ సిరుల తల్లిని ఆహ్వానించేద్దాం! ★



రెస్టరంట్, కెఫేల్లోకి వెళ్లి మెనూలో నచ్చిన ఐటమ్స్‌ని ఆర్డర్ ఇచ్చి తెప్పించుకోవడమే మనకు తెలుసు. కానీ అక్కడికెళ్లి కావాల్సింది వండుకునే కొత్త ట్రెండ్ నడుస్తోంది ఇప్పుడు. వినడానికి కాస్త క్రేజీగా అనిపించినా... 'డూ ఇట్ యువర్ సెల్ఫ్ కుకింగ్' పేరుతో కొన్ని హోటళ్లు- ఈ నయా ఫుడ్ కుకింగ్ స్టైల్‌ని తీసుకొచ్చాయి!



రెస్టరంట్లో వండుకుని తినొచ్చు!



వేద తన బర్త్‌డే రోజున స్నేహితులందరినీ హోటల్‌కి తీసుకెళ్దామనుకున్నాడు. నోరూరించే ఫుడ్ ఐటమ్స్‌తోపాటు దాన్ని మరిచిపోలేని పార్టీగా మార్చాలనుకుంటూ ఓ హోటల్‌కి తీసుకెళ్లాడు. ఘుమఘుమలాడే ఆహారపదార్థాలతో మెనూ అదిరిపోయింది అక్కడ. 'అసలైన సర్‌ప్రైజ్ నేనే ఇస్తా' అంటూ... వాళ్లకిష్టమైన వెజ్‌ఫ్రైడ్ రైస్‌ను వండటానికి హోటల్ కిచెన్లోకి వెళ్లాడు. అక్కడ రెడీగా ఉన్న పదార్థాలతో వంట పూర్తి చేసి ఫ్రెండ్స్ ముందు పెట్టాడు. ఇంకేముంది... మెనూలో ఫ్యూజన్ రుచుల్నీ, స్నేహితుడు సొంతంగా వండిన వంటల్నీ తిని పండుగ చేసుకున్నారంతా. ప్రత్యేకమైన అనుభూతిని పొందాలనుకునేవాళ్ల కోసం మొదలైన ఈ 'డూ ఇట్ యువర్ సెల్ఫ్ కుకింగ్ ట్రెండ్' మనదేశంలోని వివిధ నగరాలతోపాటు హైదరాబాద్‌లోనూ ఉంది.

ఫుడ్ వెరైటీలే కాదు, ఆహార ప్రియుల్ని ఆకట్టుకోవడానికి అందమైన ఇంటీరియర్లతో, వెరైటీ థీమ్‌లతో సరికొత్త హోటళ్లు వచ్చేస్తున్నాయి. 'అది బిర్యానీ అయినా కాఫీ అయినా... రెస్టరంట్లో చేసే ఆ పదార్థాల రుచే వేరు' అంటూ వారానికోసారైనా బయట తినడానికి ఇష్టపడుతోంది ఈతరం. టీనేజర్ల ఆ ఆలోచనలకు తగ్గట్టు ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్స్‌ని తీసుకొస్తున్నాయి హోటళ్లు కూడా. అందులో భాగంగానే ఈ సెల్ఫ్ కుకింగ్ పద్ధతి వచ్చింది. నచ్చిన పదార్థాలతో సొంతంగా వంటల్ని ప్రయత్నిస్తూ, స్నేహితులతో సరదాగా ఎంజాయ్ చేయాలనుకునే వాళ్లకు ఈ ట్రెండ్ బాగా నచ్చేస్తుంది.

ఎక్కడున్నాయి...

హైదరాబాద్‌లో '63 డిగ్రీస్' రెస్టరంట్‌లో రకరకాల పదార్థాల్ని తినడమే కాదు, వంట చేయొచ్చు కూడా. ఇందుకోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ కుకింగ్ మెషిన్ ఉంటుంది. దాని తెర మీద వంటకాల జాబితా, తయారీ విధానం కనిపిస్తాయి. అసలు వంట ఏమాత్రం రాకపోయినా పదార్థాలన్నీ సిద్ధంగా ఉంటాయి కాబట్టి షెఫ్‌ల సాయం తీసుకుంటూ కుకింగ్ చేయొచ్చు. బఫేలో భాగంగానే అక్కడున్న బోలెడన్ని వంటల రుచుల్ని ఆస్వాదించొచ్చు, ఈ 'డూ ఇట్ యువర్ సెల్ఫ్' కుకింగ్ ట్రెండ్‌ను ప్రయత్నించొచ్చు కూడా.



అసలీ పద్ధతి ఎక్కడ మొదలైందీ అంటే... టీనేజర్లను బాగా ఇన్ఫ్లుయెన్స్ చేస్తున్న జపనీస్, కొరియన్ డ్రామాల స్ఫూర్తితో దిల్లీలో 'కె ఫ్రెండ్స్ కెఫే'ను ప్రారంభించారు. విదేశాల్లో సొంతంగా వంట చేసుకునే ఏర్పాట్లతో ఉన్న కెఫేల ట్రెండే ఇక్కడికీ వచ్చిందన్నమాట. కర్ణాటకలోని మణిపాల్‌లో, బెంగళూరులో కస్టమర్లకు నచ్చినట్టు సెల్ఫ్ కుకింగ్ ట్రెండ్‌తో 'నూడుల్స్ కెఫే'లను నడుపుతున్నారు. ఇంకా తమ అభిరుచికి తగ్గట్టు కాఫీ, టీ, ఇతర స్నాక్స్ తయారుచేసుకునేలా పుణెలో 'మౌజి కెఫే' ఉంది. కోరిన ఫ్లేవర్లతో, ఇష్టమైన టాపింగ్స్‌తో నచ్చిన ఐస్‌క్రీమ్ చేసుకునేలా 'మైఫ్రోయోల్యాండ్'లాంటి పార్లర్లూ ఉన్నాయి.

ఇదంతా బాగానే ఉంది కానీ ఆ వంట చేయడమేదో ఇంట్లోనే చేసుకోవచ్చు కదా అంటారేమో... కానీ రెస్టరంట్‌లో అయితే రకరకాల పదార్థాలన్నీ తయారుగా ఉంటాయి, పైగా పక్కనే షెఫ్‌లూ ఉంటారు కాబట్టి ఆ వంటకంపైన ఏమాత్రం అవగాహన లేకపోయినా సొంతంగా సిగ్నేచర్ ఫుడ్స్ సృష్టించొచ్చు. అంతేనా! టేబుల్ దగ్గరికి తెప్పించుకుని కూర్చుని భోజనం చేయడం కన్నా సరదాగా కుకింగ్ చేసి ప్రియమైన వారికి వండి వడ్డిస్తే ఆ పార్టీకి మరింత మజా వచ్చేయదూ! ★



దోమినోస్, పిజ్జాహట్, కోకకోలా... మనకు కొత్తగా పరిచయం అక్కర్లేని అమెరికన్ బ్రాండ్‌లివి. అవే కాదు మరో 30 ప్రసిద్ధ ఆహార సంస్థలకీ, రెస్టరంట్ చెయిన్‌లకి బ్రాండ్ డిజైనర్... అర్జున్ సేన్. అమెరికాలో అగ్రశ్రేణి మార్కెటింగ్ కన్సల్టెంట్ ఆయన. తన సొంత జీవితానుభవాలని కలిపి ఆయన నిర్వహించే 'మోటివేషనల్ టాక్స్'కీ ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఆయన జీవితం ఆధారంగానే ఆ మధ్య అభిషేక్ బచ్చన్ హీరోగా 'ఐ వాంట్ టు టాక్' అనే సినిమా వచ్చింది. ఆ జీవితంలో అంతగా ఏముందో చూద్దామా...

వందరోజులే బతుకుతావన్నారు..!

అది 1996వ సంవత్సరం... అమెరికాలోని డెన్వర్ నగరం. అక్కడి పిజ్జా తయారీ సంస్థ 'బోస్టన్ మార్కెట్' ప్రధాన కార్యాలయంలో ఆ రోజు ఓ ప్రెజెంటేషన్ ఇస్తున్నాను. ఆ సంస్థ మార్కెటింగ్ రీసర్చ్ డైరెక్టర్‌గా దాని వ్యాపారాన్ని వందకోట్లకి ఎలా చేర్చాలో వివరిస్తున్నాను. అరగంట గడిచి ఉంటుందేమో... నాలో దగ్గు తెర మొదలైంది. ఓ నిమిషం పాటు ఊపిరి తిప్పుకోనివ్వలేదు. 'సారీ..' అని మళ్లీ కొనసాగించాను. పది నిమిషాల తర్వాత నా అసిస్టెంట్ వచ్చి 'మీరు కాస్త బయటకు రండి' అంది. చిరాగ్గా 'ఎందుకూ?' అంటే... నా షర్ట్‌ని చూపించింది. తెల్లని చొక్కా పైన ఎర్రని రక్తపు మరకలు! దగ్గుతుంటే... మాట్లాడుతుంటే నోటి నుంచి నెత్తుటి తుంపర్లు పడుతున్నాయని నేను గమనించనేలేదు. అప్పటికప్పుడు నన్ను ఆసుపత్రికి తరలించారు. 24 గంటల తర్వాత డాక్టర్‌లు నా దగ్గరకొచ్చారు. 'మీకు గొంతుక్యాన్సర్ ఉంది... అది జీర్ణవ్యవస్థ వరకూ పాకిపోయింది. మా అంచనా ప్రకారం ఇంకో వందరోజులే... మీరు ఈ క్రిస్మస్‌ని చూడకపోవచ్చు' అన్నారు. నాకేమీ అర్థం కావట్లేదు... కళ్లముందు నా పాపే మెదులుతోంది...

★ ★ ★

మాది కోల్‌కతా దగ్గరలోని ఆలీపూర్. మధ్యతరగతి కుటుంబం. నేను ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదివి ఎంబీఏకని అమెరికాకి వచ్చాను. ప్రతి అంశాన్నీ ఆకర్షణీయంగా మార్చి చెప్పే నా తీరుని చూసి నన్ను మార్కెటింగ్ రంగంవైపు తీసుకున్నారు. ముప్పై ఏళ్లకే 'బోస్టన్ మార్కెట్' సంస్థకి డైరెక్టర్‌ని అయ్యాను. నా భార్య సుచిత్ర అమెరికాలో పేరున్న సైకాలజిస్టు... కాకపోతే మా పాప రాకాకి రెండేళ్లున్నప్పుడు ఇద్దరం విడాకులు తీసుకున్నాం. పాప వారంలో మూడురోజులు నాతో ఉంటుంది. ఆ క్రమంలోనే- నాకు క్యాన్సర్ అని డాక్టర్లు చెప్పిన తర్వాతి రోజు నా దగ్గరకొచ్చింది. వచ్చీరాగానే 'నాన్నా! చచ్చిపోవడం అంటే ఏమిటీ?' అంది. నా విషయం వాళ్లమ్మ ద్వారా విన్నదని అర్థమైంది. నా కన్నీళ్లని చూసి 'అయితే నా పెళ్లిలో డ్యాన్స్ చేయడానికి నువ్వు ఉండవా?' అంది ముద్దుగా. అంత బాధలోనూ పకపకా నవ్వేశాను. 'తప్పకుండా డాన్స్ చేస్తాను తల్లీ!' అనేశాను. అనాలోచితంగానే అన్నా... నేను నా పాపకిచ్చిన మాట అది. ఎట్టిపరిస్థితుల్లోనూ దాన్ని నిలబెట్టుకోవాలనుకున్నాను.

ఉద్యోగం పోయింది!

క్యాన్సర్‌పైన పరిశోధనలు చేస్తున్న వైద్యులకి నా శరీరాన్ని అప్పగించాలనుకున్నాను. వాళ్లు ఏదైనా కొత్తప్రయోగం చేసి... నన్ను కాపాడగలరేమో చూడాలనుకున్నాను. అలాంటి వంద ఆసుపత్రులకి నా రిపోర్టుల్ని పంపి 'నేను నా పాప కోసం బతకాలి... హెల్ప్ చేయండి' అని లేఖరాశాను. అలా న్యూయార్క్ క్యాన్సర్ రిసర్చ్(సీఆర్ఐ) సంస్థ ముందుకొచ్చింది. వాళ్ల చికిత్సా విధానానికి నా శరీరం చక్కగా స్పందించసాగింది. కాకపోతే చికిత్స మొదలైన నెలరోజులకే 'మీరు మీ ఆరోగ్యాన్ని చూసుకోండి... ఆఫీసుకి రావొద్దు' అని మా కంపెనీ నాకు ఉద్వాసన పలికింది! దాంతో నా చికిత్సకి అవసరమయ్యే మెడికల్ ఇన్సూరెన్స్ పోయింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏ చికిత్సా లేకుండా క్యాన్సర్‌తో కుళ్లికుళ్లి చావడం కన్నా ఆత్మహత్య మేలనుకున్నాను. అందుకోసం డెన్వర్ నగరంలోని బోల్డర్ అనే కొండపైకి ఎక్కుతుంటే 'ఐ మిస్ యూ పప్పా' అనే పాప మొహమే కళ్లలో మెదిలింది. కొండ దిగాను. ఒక్కో ప్రయత్నమే చేస్తూ 'జెన్‌మ్యాంగో' అనే సొంత మార్కెటింగ్ కన్సల్టెన్సీ సంస్థని ప్రారంభించాను. దానితో తలమునకలవుతూనే చికిత్స చేయించుకోసాగాను. నా గొంతుకు మూడు సర్జరీలు జరిగాయి. క్యాన్సర్ పొట్టకీ పాకడంతో అక్కడో మూడు ఆపరేషన్‌లు. వీటి మధ్య ఓసారి గుండెపోటొచ్చి మృత్యువు వాకిలి దాకా వెళ్లొచ్చాను. ఎలాగో అన్నింటి నుంచీ బయటపడ్డానని ఊపిరిపీల్చుకుంటే... రెక్టల్ క్యాన్సర్ అన్నారు. దానికీ కలిపి మొత్తం 20 ఆపరేషన్‌లు. ప్రతి సర్జరీ ముందూ జీవితానికి అవే చివరి క్షణాలనుకుని పాపకి వీడియో మెసేజ్‌లు పెట్టేవాణ్ణి!



ఆ సర్జరీల మధ్యే 'జెన్‌మ్యాంగో'ని విజయవంతంగా నడిపాను. నా చిన్నారి రాకానే దానికి మేనేజర్‌గా ప్రకటించాను! డోమినోస్ నుంచీ పిజాహట్ దాకా అందరూ మార్కెటింగ్‌లో నా సలహాలు కోరారు... నా సహకారంతో అమెరికా వ్యాప్తంగా పదివేలకిపైగా కొత్త రెస్టరంట్‌లు ఏర్పడ్డాయి. మార్కెటింగ్ మాంత్రికుడిగా నాకు పేరు తెచ్చాయి..! మరోవైపు వరస సర్జరీలతో గొంతు పూడుకుపోయి... మాట ముద్దగా మారినా సరే... నా కథ నలుగురికీ స్ఫూర్తినిస్తుందని నమ్మాను. 'మోటివేషనల్ స్పీకర్'గా దాన్నే ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్నాను. ఈ మధ్యే నా జీవితాన్నీ పాపతో నా అనుబంధాన్నీ వివరిస్తూ 'రైజింగ్ ది ఫాదర్', 'అన్‌క్విట్' అనే పుస్తకాలు రాశాను. ★



అవీ ఇవీ

అప్పుడు చెత్త యార్డు... ఇప్పుడు అందాల తోట!

చెత్త... దేశం మొత్తం ఎదుర్కొంటున్న సమస్య, ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య కూడా! దీనికి గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఉన్న నాక్రావాడీ ప్రాంతం చక్కని పరిష్కారాన్ని చూపించింది. నాక్రావాడీ ఒకప్పుడు అతిపెద్ద డంపింగ్ యార్డ్... ఇక్కడికి ప్రతిరోజూ ఏడొందల టన్నుల చెత్త వచ్చి చేరేది. అలా పదేళ్లుగా 16 లక్షల టన్నుల వ్యర్థాలు చేరి... ఈ ప్రాంతాన్ని అనేక రకాలుగా కలుషితం చేశాయి. భరించరాని దుర్వాసనతో పాటు... ఇక్కడి భూగర్భజలాలూ కలుషితం అయ్యాయి. అలాంటి ప్రాంతం ఇప్పుడు ప్రభుత్వం, ఎన్జీవోలూ, స్థానికుల పుణ్యమాని 20 ఎకరాల పచ్చని ఉద్యానవనంలా మారిపోయిందంటే ఆశ్చర్యం కలుగుతుంది. అత్యాధునిక యంత్రాల సాయంతో ఇక్కడి చెత్తలో కొంత భాగం నుంచి ఇంధనాన్ని ఉత్పత్తిచేస్తే, మరికొంత భాగాన్ని ఎరువుగా మార్చేశారు. ఖాళీ అయిన ఆ ప్రాంతంలో మియావాకీ పద్ధతిలో స్థానిక రకాలకు చెందిన రెండున్నర లక్షల చెట్లను నాటారు. మరి వాటికి నీళ్లు అందివ్వాలి కదా... దానికోసం నగరంలోని డ్రైనేజీ నీటిని రీసైక్లింగ్ చేసి ఈ చెట్లకు మళ్లించారు. మధ్యలో చెరువునీ తవ్వారు. అలా ఒకప్పుడు సమస్యగా ఉన్న నాక్రావాడీ డంపింగ్ యార్డ్ ప్రస్తుతం అందమైన ఉద్యానవనంగా మారిపోయింది.



షుగర్ బార్బీ!

బార్బీబొమ్మని చూస్తే చూడముచ్చటగా ఉంటుంది కదా... అందుకే ఎంతోమంది పిల్లలు వీటితో ఆడుకోవడానికి ఆసక్తి చూపిస్తూ ఉంటారు. మరి అలాంటి బార్బీబొమ్మకి టైప్1 డయాబెటిస్ ఉంటే? బొమ్మకి డయాబెటిస్ ఉండటమేమిటీ అనే సందేహం వచ్చింది కదూ! అవును, ఈ మధ్య విడుదలైన బార్బీ బొమ్మ నీలంరంగు పోల్కీ చుక్కల డ్రెస్‌తో ఎంత అందంగా ఉన్నా, దాని నడుముకున్న ఇన్సులిన్ పంప్, గ్లూకోజ్ మానిటర్, స్మార్ట్‌యాప్ వంటివి అందరినీ ఆలోచింపచేస్తున్నాయి. ఈ బొమ్మని చూడగానే ఈ మానిటర్ ఏంటీ, అసలేంటీ టైప్1 డయాబెటిస్ అనే ఆలోచన మొదలవుతుంది కదా... అలా ఆలోచించాలన్న ఉద్దేశంతోనే బ్రేక్‌త్రూ- టీ1డీ అనే స్వచ్ఛంద సంస్థ, బార్బీ బొమ్మలు తయారుచేసే మేటెల్ కంపెనీతో కలిసి ఈ బార్బీని రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పిల్లలు టైప్1 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కానీ ఈ వ్యాధిపైన సరైన అవగాహన లేకపోవడం, పరిశోధనలు చేసే సంస్థలకు తగినంత నిధులు లేకపోవడం వంటివాటిని దృష్టిలో పెట్టుకుని బ్రేక్‌త్రూ సంస్థ ఈ బొమ్మని తయారుచేసింది. ఇలా అయినా ఈ వ్యాధిపైన అందరూ దృష్టిపెడతారని అంటున్నారు తయారీదారులు.





బామ్మ ప్రేమ అద్దెకు దొరుకుతుంది!

ఇంట్లో పెద్దవాళ్లుంటే అన్నివిధాలుగా బాగుంటుంది. ఏది మంచో, ఏది చెడో చెబుతారు. వాళ్ల అనుభవసారంతో వంటలు మొదలు ఎన్నో పనులు నేర్పిస్తుంటారు. అంతేనా, ఏ ఇబ్బంది వచ్చినా మంచి మాటలతో ధైర్యాన్నిస్తారు. కానీ మారుతున్న జీవనశైలి వల్ల ఎక్కువగా చిన్న కుటుంబాలే కనిపిస్తున్నాయి. ఇంట్లో పెద్దవాళ్లను తోడుగా ఉంచుకునే పరిస్థితి దాదాపుగా తగ్గిపోతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తూ జపాన్‌లో 'రెంట్ ఏ గ్రాండ్‌మా' సర్వీసులు మొదలయ్యాయి. ఇక్కడ గంటకు దాదాపు రెండు వేల రూపాయలిచ్చి బామ్మను అద్దెకు తెచ్చుకోవచ్చు. లవ్‌బ్రేకప్స్‌లాంటివి ఉంటే మనసారా వాళ్లతో మాట్లాడుకుని మనసులోని భారాన్ని దించుకోవచ్చు. వాళ్ల దగ్గర ఏ పనైనా నేర్చుకోవచ్చట. ఒకవైపు ఒంటరిగా ఫీలయ్యే యువతకు తోడుగా ఉంటూనే, ఈ సేవలతో బామ్మలు ఆదాయమూ బాగానే అందుకుంటున్నారట!





నాచీ బకరా... తీరే వేరయా

ఆ మేకలు నడిచినా, నాట్యం చేసినట్టే ఉంటుంది. అలాగని వీటికి ఎవరూ ప్రత్యేకించి ట్రైనింగ్‌లాంటిదేమీ ఇవ్వరు. ఒక అడుగు ముందుకూ, రెండడుగులు వెనక్కీ వేస్తూ చెంగుచెంగున నడిచే ఆ మేకల తీరే అంత. అందుకే వీటిని డ్యాన్సింగ్ గోట్స్ అనీ, నాచీ బకరా అనీ అంటారు. పంజాబ్, రాజస్థాన్, పాకిస్థాన్ ప్రాంతాల్లో మాత్రమే పెరిగే ఈ మేకల కొమ్ములు కూడా మెలికలు తిరిగి చూడముచ్చటగా ఉంటాయి, ఊలు మెరుస్తూ అందరినీ ఆకట్టుకుంటుంది. ఇన్ని ప్రత్యేకతలున్నాయి కాబట్టే, ఆ ప్రాంతంలో ఈ మేకలకు డిమాండూ ఎక్కువే. పెళ్లిళ్లూ, పండగలప్పుడు రైతులు ఈ మేకలని ఊలుబంతులూ, నగలతో అందంగా అలంకరించి వాటితో ప్రదర్శనలు ఇప్పిస్తూ ఉంటారట. అలాగే వీటి కోసం బెస్ట్ వాక్ పోటీలు కూడా జరుగుతుంటాయట. ఆ పోటీలకు ప్రత్యేకంగా వీటిని సిద్ధం చేసి పంపించడం, వీటి ఊలుతో రగ్గులు తయారుచేయడం ద్వారా అక్కడి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. నిజానికి ఈ మేకల్లో ఉన్న కొన్ని జన్యుపరమైన లోపాల వల్లే అవి సాధారణ మేకల్లా కదల్లేవు. అందుకే వాటి నడక ప్రత్యేకంగా కనిపిస్తుందట.








ఉన్న ఊరు తరిమేస్తే.... తలదాచుకోవడానికి వచ్చిన చోట ప్రతి క్షణం నరకమే! నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకోవడం కోసం... తోటి పిల్లల హేళనలు భరించాడు, మరుగుదొడ్లు కడిగాడు, రెస్టరంట్లో అంట్లు తోమాడు. ఆ కష్టాలనీ, కన్నీళ్లనే పునాదులుగా చేసుకుని ప్రపంచంలోనే నం.1 టెక్ కంపెనీని స్థాపించాడు. ఈ కథ మరెవరిదో కాదు... నాలుగులక్షల కోట్ల రూపాయలు విలువ చేసే ఎన్విడియా సంస్థని ప్రారంభించిన జెన్సన్ హువాంగ్‌ది. అతని గెలుపు- మనకూ ఎన్నో పాఠాలని నేర్పుతోంది...





నాలుగులక్షల కోట్ల... విజయ రహస్యం ఇదే!

ఇంగ్లిష్ డిక్షనరీ నుంచి రోజూ ఓ పదిపదాలు తీసుకుని వాటిని అమ్మకు అప్పజెప్పాలి. జెన్సన్, వాళ్లన్నయ్యా ఆ పనిని క్రమం తప్పకుండా చేసేవాళ్లు. ఎందుకంటే వాళ్లకు ఇంగ్లిష్ రాదు. తాము పుట్టిన తైవాన్‌లో హాయిగా బతికే పరిస్థితులు లేవు. ఏదో ఒకరోజు తైవాన్‌ని వదిలిపోవాల్సిందే... అందుకే నాలుగు ఇంగ్లిష్ ముక్కలు వస్తే, ఎక్కడైనా బతికేస్తారన్న ఆశతో ఉన్నవన్నీ తెగనమ్మి అమెరికాలో ఉన్న తన తమ్ముడి దగ్గరకు పంపించింది జెన్సన్ తల్లి. అతనూ పెద్దగా చదువుకోలేదు, దాంతో మంచి స్కూల్ అనుకుని జెన్సన్‌ని బాలనేరస్థులనీ నేరచరిత్ర ఉన్న బాలల్నీ తీర్చిదిద్దే స్కూల్లో వేశాడు. అక్కడ ప్రతిరోజూ నరకమే... ఆ స్కూల్లోని పిల్లల చేతుల్లో కత్తులు ఉండేవి. ఎప్పుడు, ఎవరు ఎలా ప్రవర్తిస్తారో తెలియదు. దానికి తోడు వచ్చీరాని ఇంగ్లిష్... జాతివివక్షతో ఎదురయ్యే అనేక అవమానాలతో అతనికి నిద్ర పట్టేదికాదు. రోజూ ఏదో ఒక పనిష్మెంట్ పేరుతో టాయిలెట్లు శుభ్రం చేయించేవారు అక్కడ. కాలుపెడితే కూలిపోతుందేమో అనిపించే వంతెనపైన ప్రాణాలు అరచేత పట్టుకు ప్రయాణించి అతికష్టంమీద ఆ బడికి వచ్చేవాడు జెన్సన్. ఇన్ని కష్టాలూ చదువు కోసమే భరించాడు. ఓ రెస్టరంట్లో అంట్లుతోముతూ, ఆ వచ్చిన డబ్బుతో ఇంజినీరింగ్ పూర్తిచేసి, చిప్ డిజైనర్‌గా ఉద్యోగం సంపాదించాడు. తినీ తినక దాచిపెట్టుకున్న డబ్బుతో ఎన్విడియాని స్నేహితులతో కలిసి స్థాపించాడు. ఇంతకీ ఎన్విడియా ఏం చేస్తుందంటే...

తెలివైన వ్యాపారి...

'ధగధగ మెరిసే బంగారం వెనుక పరుగు పెట్టడాన్ని గోల్డ్‌రష్ అంటారు. ఆ పని ఎవరైనా చేయగలరు, నువ్వు తెలివైన వాడివైతే... అలా పరుగు పెట్టేవాళ్లకి కావాల్సిన ఆయుధాలు సమకూర్చి, డబ్బు సంపాదించు' అనేది ఆంగ్ల సామెత. ఎన్విడియా సరిగ్గా ఇదే పనిచేస్తోంది.



ప్రపంచాన్ని శాసిస్తున్న ఏఐ టెక్నాలజీని బంగారు గని అనుకుంటే, అక్కడ నుంచి ఆ పసిడిని వెలికితీయడానికి ఉపయోగించే శక్తిమంతమైన ఆయుధం- కంప్యూటర్స్‌లో వాడే 'చిప్స్'. గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్, చాట్‌జీపీటీ వంటి సంస్థలకి ఈ చిప్స్‌ని విక్రయిస్తూ కోట్లు సంపాదిస్తోంది ఎన్విడియా. 'జురాసిక్ పార్క్' సినిమా తెలుసుకదా... గ్రాఫిక్స్ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియచేసిన సినిమా. ఆ సినిమా తర్వాత నుంచే గ్రాఫిక్స్‌కీ, వీడియోగేమ్స్‌కీ ఆదరణ వచ్చింది. కానీ, గ్రాఫిక్స్‌లాంటివి చేయాలంటే సాధారణ కంప్యూటర్లు సరిపోవు. కచ్చితంగా జీపీయూ(గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్)చిప్స్ ఉన్న కంప్యూటర్లే కావాలి. 'ఆ చిప్స్ ఏవో మనమే చేస్తే...' అనుకున్నారు జెన్సన్, అతని ఇద్దరు స్నేహితులు క్రిస్, కర్టిస్‌లు. అలా గేమింగ్ సంస్థలకు అవసరం అయిన జీపీయూ చిప్స్‌ని అందించే ఆలోచనతో 'ఎన్విడియా' సంస్థని 1993లో ప్రారంభించారు వాళ్లు. కానీ మొదటి ఏడాదిలోనే ఘోరమైన వైఫల్యాన్ని చవిచూసింది ఎన్విడియా. ఈ సంస్థ మొదటి ప్రయత్నంగా చేసిన ఎన్వీ1 రకం చిప్ మార్కెట్లో అమ్ముడుపోలేదు. కారణం మార్కెట్ అవసరాలని గుర్తించకుండా ప్రయోగాలు చేయడమే. ఆ పొరపాటు సంస్థని దివాలా అంచులవరకూ తీసుకెళ్లింది. అమ్మిన చిప్స్ అన్నీ వెనక్కి వచ్చాయి, సంస్థలో 60శాతం ఉద్యోగులని తీసేయాల్సి వచ్చింది, పెట్టుబడి సంస్థలు వెనక్కి తగ్గాయి, భాగస్వాములు ఉండాలా-వద్దా అని వెనకాడుతున్నారు. ఇక రేపో, మాపో సంస్థని మూసేయడం ఖాయం అనుకున్న తరుణంలో జెన్సన్ మరొక్క అవకాశం కోసం వెతికాడు. ఉన్న స్టాఫ్‌తోనే 'రివా128' అనే మరో చిప్‌ని తయారుచేశాడు. ఊహించని విధంగా నాలుగు నెలల్లోనే 10 లక్షల యూనిట్లు అమ్ముడుపోయాయవి. సంస్థ నిలబడింది. వైఫల్యాన్ని అంగీకరించకుండా, వాదిస్తూ కూర్చుంటే... ఇంకా ఇంకా ఓటమి ఊబిలో కూరుకుపోతాం, ఏ దారీలేని డెడ్ ఎండ్‌కి చేరుకుంటాం. అలాకాకుండా ఓటమి నుంచి బయటపడే దారిని వెతికితే రిస్క్‌ని కాస్తయినా తగ్గించుకోవచ్చు అంటాడు జెన్సన్. 32 ఏళ్ల ప్రయాణంలో ఇలాంటి వైఫల్యాలని చాలానే చూసింది ఎన్విడియా. కానీ ప్రతిసారీ 'ఓటమి అంటే వాయిదా పడ్డ విజయమే' అనుకుంటూ సరికొత్త మార్పులతో విజయాలని సొంతం చేసుకున్నాడు జెన్సన్. సూపర్ కంప్యూటర్ల వాడకం పెరగడం, వాటికి నిర్వహించే డేటా సెంటర్లనూ దృష్టిలో పెట్టుకుని 2006లోనే ఏఐ, దానికి అవసరం అయిన చిప్స్ గురించి ఆలోచించాడు. ఏఐ బూమ్ రాగానే ఆ అవకాశాన్ని అందుకుని లాభాలని సొంతం చేసుకున్నాడు. అతని ముందుచూపే ఎన్విడియాని టెక్ కంపెనీల వరుసలో ముందు ఉంచింది. ప్రస్తుతం డేటా సెంటర్లు, డ్రైవర్ లెస్ వెహికల్స్ ఏఐ కంపెనీలకు అవసరం అయిన చిప్స్ తయారుచేస్తోంది సంస్థ. అలాగే భవిష్యత్తుని శాసించే రోబోటిక్స్, డిజిటల్ ట్విన్స్ తయారీలోనూ దూసుకెళ్తోంది. 'నాలుగు లక్షల కోట్ల విలువైన సంస్థ నిర్వహణ కష్టం కదా...' అని ఎవరైనా అడిగితే 'అదేంలేదు తెల్లారి లేచాక ఎన్ని పనులున్నా... అందులో ఏది ముఖ్యమో దాంతోనే నా రోజుని మొదలుపెడతాను. నిన్నటికోసమో రేపటికోసమో బతకడం కన్నా ఈ క్షణంలోనే జీవించడం మేలు' అంటాడు జెన్సన్. ★

ఓ తల్లి కథ

– బలభద్రపాత్రుని రమణి

"ఏడవకు... మళ్ళీ ప్రయత్నిద్దాం. వేరే ఐవీఎఫ్ క్లినిక్‌కి వెళ్దాం" శ్రీనాథ్ ఓదారుస్తున్నాడు.

నా మనసు ఒప్పుకోవడం లేదు. "క్లియర్‌గా మనిద్దరం తల్లిదండ్రులం కాలేము అని చెప్పేశారుగా... అదంతా వేస్ట్..." అన్నాను.

అతను నా తల నిమురుతూ "జననీ... మనం ఎవరినైనా అడాప్ట్ చేసుకుందాం. నువ్వు తల్లివి కాకుండా ఈ సృష్టిలో ఎవరూ ఆపలేరు. ఈ ప్రపంచంలో ఎంతోమంది అనాథలున్నారు" అన్నాడు.

అతని కళ్ళల్లోకి చూసి, నా కడుపు మీద చెయ్యి వేసుకుని నిమురుకుంటూ ఉండిపోయాను.

'గొడ్డుమోతు చెట్టు కంప కింద తయారయ్యింది. ఓ పువ్వా పండా? నాలుగేళ్ళ నీళ్ళు పోశాను అనవసరంగా...' దానిమ్మ చెట్టు కొట్టిస్తూ పక్కింటి శేషమ్మగారు అన్న మాట నాకు గుచ్చుకుంది. ఇలా ఎవరేం మాట్లాడినా నేను హర్ట్ అవడం, తల్లి కాలేని నా లోపాన్ని ఎత్తి చూపించినట్లుగా భావించడం. నా తప్పు కానీ వాళ్ళది కాదు.

"రోజురోజుకీ మరీ సెన్సిటివ్‌గా తయారవుతున్నావ్" అంటూ శ్రీనాథ్ నన్ను కౌన్సిలింగ్‌కి తీసుకెళ్ళాడు.

ఆ డాక్టర్ అమృత చాలా దయగా మాట్లాడారు. అడాప్షన్ ఏజెన్సీలో చట్ట ప్రకారం మమ్మల్ని రిజిస్టర్ చేయించుకోమన్నారు. నా పాత జీవితంలోకి మళ్ళీ వెళ్ళమనీ, నేను మానేసిన బేకింగ్ మళ్ళీ స్టార్ట్ చెయ్యమనీ ఎన్నో విధాలుగా నచ్చచెబుతూ నాకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

అక్కడున్నంతసేపూ బాగానే ఉండేది. మళ్ళీ ఇంటికి రాగానే ఓ పాప బొమ్మ చూసినా, ఏదైనా సినిమా చూసినా... మళ్ళీ ఆలోచనలు! ఖాళీగా శూన్యంగా నా గదీ, మదీ- నామీద దాడి చేసేవి. ఆ శూన్యం... ఈ అదృష్టం లేనివాళ్ళకే అర్థం అవుతుంది, వేరే వాళ్ళకి అర్థం కాదు అనిపించేది.

శ్రీనాథ్ ఆఫీసు పనిమీద సింగపూర్ వెళ్తూ నన్ను పుట్టింట్లో కొన్నాళ్ళు ఉండి రమ్మని పంపించాడు.

అమ్మా నాన్నా నన్ను చూసి చాలా ఆనందించారు.

రిటైర్ అయిపోయినా సొంత ఊరు వెళ్ళి సొంతింట్లో వానప్రస్థం గడుపుతూ మొక్కా మొటికా వేసుకుని వాటిలోనే పిల్లల్నీ బంధాల్నీ చూసుకుంటూ ఒంటరిగా ఉండేవాళ్ళిద్దరికీ- అన్నయ్యా వదినా పిల్లలూ వెళ్ళినా, నేనూ శ్రీనాథ్ వెళ్ళినా పండగే!

అమ్మ చాలా సెన్సిటివ్‌గా డీల్ చేస్తుంది నాతో. సాధారణంగా ఎవరి పిల్లల గురించీ వాళ్ళ ఉన్నతి గురించీ అల్లరి గురించీ నాముందు మాట్లాడదు. కానీ, నాన్నగారు పెద్దగా పట్టించుకోరు.

"నీలీ, పాపని తీసుకురా. పసిపాపల సందడీ తోటలో పిట్టల కలకలం ఎంతో బాగుంటాయి" అన్నారు- బావి దగ్గర అంట్లు తోముతున్న అమ్మాయితో. చెవుల్లో ఇంకా దూది పెట్టుకున్న ఆ అమ్మాయి బాలింతలా ఉంది. పట్టుమని పదహారేళ్ళు కూడా లేనట్టు చిన్నగా సన్నగా, నీరసంగా ఉన్నా చూడముచ్చటగా ఉంది. ఆమెని పరికించి చూశాను. ఎందుకో ఆధారంలేని తమలపాకు తీగ వేలాడపడిపోయినట్టు అనిపించింది.

"నువ్వెందుకొచ్చావే పనికి, మీ అమ్మేదీ?" అని అమ్మ పెద్దగా అరిచింది.

"అమ్మకి ఒంట్లో బాలేదంట, నన్ను పొమ్మంది" అంది నీలి.

"పసిది పాలు తాగకుండా ఇంతసేపు ఎలా ఉంటుందీ... చేసింది చాలు, వెళ్ళు" అంది అమ్మ.

"దానికి పోత పాలు పడుతున్నాం అమ్మా, పాలు సరిపోవట్లేదు" అంది నీలి, పాత్రలు కడగడం పూర్తిచేసి లేస్తూ.

"నువ్వు సరైన ఆహారం తీసుకుంటే కదా... పాలు పడేది. వెళ్ళేటప్పుడు మర్చిపోకుండా పళ్ళు తీసుకెళ్ళు" అంది అమ్మ.

నీలి తలూపింది.

నేను పుస్తకం చదువుకుంటూ ఇదంతా ఓ చెవి వేసి విన్నాను.

అమ్మ నా దగ్గరకొచ్చాక "ఏం చేస్తాడు ఈ నీలి మొగుడు?" అని అడిగాను.

"మొగుడా, మొద్దులా... కొన్నాళ్ళు సిటీలో మేనత్త ఇంట్లో ఉండి, ఇదంతా తెచ్చుకుంది. ఎవరే అంటే... 'బస్తీ బాబు... పెళ్ళి చేసుకుంటా అన్నాడు' అని చెప్తుంది. ఓ పేరూ అడ్రసూ ఫొటో ఏమీ లేదు. నాలుగోనెల వచ్చాక తెలిసి ఆ తల్లి లబలబలాడింది. అబార్షన్ చెయ్యడానికి డాక్టర్ ఒప్పుకోలేదు. పైగా నీలి చాలా బలహీనంగా ఉంది. అందుకే ఉంచేశారు" అంటూ నీలి పురాణం చెప్పేసింది అమ్మ.


ఆ సాయంత్రం నాన్న ఎత్తుకుని తిప్పుతున్న పసిపాపని చూశాను. చాలా ముద్దుగా ఉంది... ఎవరో కొంచెం అందగాడి వరప్రసాదమే. 'దుర్మార్గుడు... అలా ఎలా తల్లిని చేసి వదిలేశాడో' అనుకున్నాను కోపంగా.

"ష్! దాన్ని ఇచ్చేసి రండి" అమ్మ కోప్పడుతూ అంది నాన్నని.

"ఇటు తీసుకురండి నాన్నా" అన్నాను.

నాన్న పాపని తీసుకొచ్చి ఇస్తూ "చూడు, ఆంటీ..." అని పాపని నాకు అందించారు.

పాపని ఎత్తుకోగానే, బోసినవ్వులు నవ్వింది. అప్పుడే విరిసిన గులాబీ పువ్వులా ఆ నవ్వు ఎంత ఆహ్లాదంగా ఉందో... చిన్నచిన్న కాళ్ళతో నా గుండెల్ని తంతుంటే, ఎంతో హాయిగా



అనిపించింది. అక్కడ గూడు కట్టుకుపోయిన బాధేదో కరిగిపోతున్నట్లుగా అయింది. ఎత్తుకుని తోటంతా తిరిగాను. దానికి అర్థం కాకపోయినా- ప్రతి పువ్వూ కాయా చూపిస్తూ, ఆడిస్తూ ఆనందంగా గడిపాను.

"అమ్మా, పాపకి పాలు ఇప్పించి తీసుకొస్తాను, ఇవ్వండి" అని నీలి తల్లి పైడమ్మ అడుగుతుంటే ఇవ్వలేక ఇవ్వలేక ఇచ్చాను.

అప్పటి నుండీ రోజూ పాపతో ఆడుకోవడంతోపాటు 'గులాబీ' అని పిలవడం మొదలెట్టాను.

నీలి చాలా అభావంగా పాప వైపు చూసేది. వాళ్ళమ్మ ఓనాడు 'దీనికి అసలు పాప మీద ప్రేమ ఉందా లేదా తెలీడం లేదు అమ్మగారూ. పాలిచ్చి ఎటో చూస్తూ కూర్చుంటది. పలకా బలపం తీసుకుని ఏవో అక్షరాలు రాసుకుంటుంటది, లేదంటే ఏవో కథల పుస్తకాలు తెచ్చుకుని చదువుకుంటూ ఉంటది' అని కంప్లైంట్ చేసింది.

అమ్మ అంతా విని "అదీ చిన్నదే కదే... ఇంకా దానికి ఈ బాధ్యత అర్థం కావడం లేదులే" అంది.

పైడమ్మకి భర్త లేడు. ఈ పాచిపనులే ఆధారం. పిల్లన్నా మనవరాలన్నా ప్రాణం. ఇదంతా సంఘంలో అవమానం అనీ సమాజం ఏమంటుందోననీ గుండెలు బాదుకునేటంత తెలివితేటలూ లేవు. 'కూతురికి ఒక యాక్సిడెంట్ అయింది సిటీలో' అన్నంత తేలిగ్గా తీసుకునే ఔన్నత్యం మాత్రం ఉంది.

పది రోజుల్లో- 'గులాబీ' కోసం ప్రతి పూటా ఎదురుచూడటం అలవాటైపోయింది. పాలసీసాతో సహా ఇమ్మని నేనే పట్టిస్తున్నాను. ఆ పసిదాన్ని పక్కలో వేసుకుని పడుకుంటే, ఆ ఆనందం శాశ్వతం అవ్వాలనే ఆశ రోజురోజుకీ పెరిగిపోయింది.

ఒకరోజు అమ్మని అడిగాను "అమ్మా, గులాబీని నాకు ఇస్తారేమో అడుగు. నీలి జీవితం సుఖంగా గడిచేట్లు మనం చూద్దాం" అన్నాను.

"ఏ తల్లీ బిడ్డని అమ్ముకోడానికి ఇష్టపడదు. అందుకే అసలు దాన్ని తీసుకురావద్దని మీ నాన్నకి చెప్పాను" అమ్మ ఘాటుగా చెప్పింది.

కొద్దిగా బాధపడినా, "అడిగి చూస్తే ఏం" అన్నాను.

నాన్న నా మాటకి వత్తాసు ఇస్తూ "పెద్ద ఇంట్లో పిల్ల పెరిగి పెద్దయి, దాని జీవితం బాగుంటుందని



ఆలోచిస్తారేమో, ఎవరికి తెలుసు? అడిగి చూద్దాం" అన్నారు.

అమ్మా నాన్నా పైడమ్మ గుడిసెకి వాళ్ళే వెళ్ళారు.

నాకు క్షణమొక యుగంగా గడుస్తోంది. అటూ ఇటూ పచార్లు చేస్తున్నాను. నా జీవితం ఈ ముప్ఫైఆరేళ్ళూ గడిచింది కాదు, ఇప్పుడే- ఈ నీలి జవాబు మీదే- ఆధారపడి ఉంది అనిపించింది.

"ఏమిటా పరధ్యానం, పిలుస్తుంటే?" అన్న శ్రీనాథ్ గొంతు విని ఉలిక్కిపడ్డాను.

ఎదురుగా నవ్వుతూ బ్యాగ్‌తో నిలబడి ఉన్నాడు.

"శ్రీ... టైమ్‌కి వచ్చావు. ఒక ఇంపార్టెంట్ ఘట్టం జరగబోతోంది మన జీవితంలో" అని ఆనందంతో ఎగ్జైట్‌మెంట్‌తో అతన్ని చుట్టుకుపోయి, నేను ఏం చేస్తున్నానో చెప్పాను.

శ్రీనాథ్ అంతా విని, నన్ను కూర్చోపెట్టి, తనూ నా పక్కన కూర్చున్నాడు.

"ఎక్కువ ఎగ్జైట్ అవ్వకు, ఇస్తారో లేదో" అన్నాడు.

నేను నీలి అసహాయతా, పైడమ్మ ఆర్థికస్థితీ అన్నీ వివరించాను.

అతను అంతా విని "అయినా నాకు డౌటే" అన్నాడు.

"గులాబీని ఎప్పుడంటే అప్పుడు నీలి వచ్చి చూడొచ్చు. మంచి స్కూల్లో వేసి, మంచిగా పెంచుతాం అని చెప్తాను" అన్నాను.

"అమ్మా!" అని పరిగెత్తుకుంటూ నీలి వచ్చింది. ఆత్రంగా గేటు తీసుకుని ఏడుస్తూ వచ్చింది. శోక దేవతలా ఉంది... నన్ను అర్థిస్తూ, అసహాయంగా, కబేళాకొచ్చిన మేకపిల్లలా చూస్తోంది.

"పాప నాకు దేవుడిచ్చిన వరం అమ్మా. అదొక్కటే నా దగ్గర ఉంది. దాన్ని కూడా లాక్కుపోతారా? మీరు ఏదైనా కొనుక్కోగల పెద్దోళ్ళమ్మా. నేను ఏదీ కొనుక్కోలేనుగా" అని నా కాళ్ళు పట్టుకుని ఏడుస్తూ "మా అమ్మ ఇచ్చేయమంటోంది

తల్లీ... దానికేం తెల్సు నా బాధ! దాని బిడ్డ దాని దగ్గరే ఉందిగా" అంది.

శ్రీనాథ్ 'నేను చెప్పలేదూ!?' అన్నట్లు నావైపు చూశాడు.

ఎంతో ఆశాభంగం చెందాను. చేతికొచ్చి జీవితం చేజారిపోయినట్టు ఫీల్ అయ్యాను.

"నీకు ఇష్టం లేకుండా లాక్కోను నీలీ" అన్నాను. నాకూ కళ్ళ నుండి నీళ్ళు జలజలా కారిపోతున్నాయి.

"నిన్ను బాధపెడితే క్షమించు" అన్నాను.

శ్రీనాథ్ నా భుజాల చుట్టూ చెయ్యి వేసి "గులాబీని ఇవ్వద్దులే కానీ నీలీ... నీకు చదువుకోవాలని ఉందా?" అని అడిగాడు.

ఆమె ఆశ్చర్యంగా చూసింది. ఆ కళ్ళల్లో రెపరెపలాడే ఆశ...

"అవును నీలీ... నా కళ్ళకి నువ్వే ఓ పాపలా కనిపిస్తున్నావు" అన్నాడు శ్రీనాథ్.

"శ్రీ..?" అర్థం కానట్టు చూశాను.

★ ★ ★

ఆ తరవాత- మేం ఒక బిడ్డకి తల్లిదండ్రులుగా తిరుగు ప్రయాణం అయ్యాం. 'రిజిస్టర్ ఆఫీసుకి వెళ్ళి, లాండ్ రిజిస్ట్రేషన్‌లా బిడ్డని కూడా రిజిస్టర్ చేసుకోండి' అని ఎవరో సలహా ఇచ్చారు.


మా బిడ్డ మేజరట!

అవును, నీలిని మేం దత్తత తీసుకున్నాం. నీలితోపాటు బోనస్‌గా గులాబీ వచ్చింది.

ఈ నీలి అనే చిట్టి మొక్కకి పూసిన పసిమొగ్గని ఎలా తుంచుతాం? ★

దారి కనుక్కోండి

బంటీ సైకిల్ తొక్కుతుండగా చైన్ పడింది. తనకేమో దాన్ని సరిచేయడం రావడం లేదు. ఆ నేస్తానికి మీరు సాయం చేయరూ!



గప్‌చుప్

పిల్లలంతా హోంవర్క్ చేసుకుంటున్న చిత్రమిది. బొమ్మను బాగా గమనించి కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి చూద్దాం.

1. ఇక్కడున్న పువ్వుల్లో ఏవి ఎక్కువగా ఉన్నాయి?
2. పప్పీకి ఎన్ని సంవత్సరాలో తెలిసిందా?
3. ఫొటోఫ్రేమ్‌లో చెమట పట్టని జంతువు ఒకటుంది. అది ఏది?
4. పిల్లలంతా ఒకే తరగతికి చెందినవారు... ఏ తరగతో చెప్పగలరా?
5. బొమ్మలో ఒక పొరపాటు ఉంది. అదేంటో గుర్తించారా?



పట్టుకోండి చూద్దాం

స్నేహితులంతా కలిసి సైకిల్ తొక్కుతున్న ఈ బొమ్మలో... అయిదు చోట్ల స్పిన్నర్ దాగి ఉంది. ఎక్కడెక్కడుందో కనిపించిందా?



చెప్పుకోండి చూద్దాం

ఇక్కడున్న బొమ్మల ఆంగ్ల పేర్లలోని మొదటి అక్షరాల్లో అర్థవంతమైన పదం దాగి ఉంది. అయితే, వరసలో ఎక్కడి నుంచైనా ఆ పదం ప్రారంభం కావొచ్చు. మరి అదేంటో చెప్పండి చూద్దాం.




దాగుడుమూతలు



పిల్లలంతా ఎంచక్కా ఆడుకుంటున్నారు కదూ! అడుగునున్న వస్తువులు బొమ్మలో దాగున్నాయి. అవి ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి చూద్దాం.

అది ఏది?

రంగు గడిలోని బొమ్మను పోలి ఉన్నదేదో చెప్పండి చూద్దాం.



రంగులేద్దాం




ఒక ఊరిలో రామయ్య, వీరయ్య అనే ఇద్దరు వ్యక్తులు సైకిల్ మీద తిరుగుతూ చీరలు అమ్మేవారు. వాళ్లు ఊరిని రెండు సగాలుగా చేసుకున్నారు. ఇద్దరూ చెరో సగంలో ఉదయం అమ్మకం మొదలు పెట్టి, మధ్యాహ్నం కాగానే మరో సగానికి వెళ్లాలని ఓ నిర్ణయానికొచ్చారు. ఒకరోజు వీరయ్య సైకిల్‌పైన చీరలతో ఒక గుడిసె ముందు నుంచి వెళ్తున్నాడు. ఆ గుడిసెలో ఒక అవ్వ, తన మనవరాలితో కలిసి ఉంటోంది. వీరయ్య పిలుపు విని... అవ్వకు చీర కొనాలనుకుందా మనవరాలు. వీరయ్యని పిలవగా.. అతడు చీరలు చూపించసాగాడు. వాటిలో ఒకటి నచ్చడంతో దాని ధర అడిగింది. ఇంతలో బయటికొచ్చిన అవ్వ 'అమ్మో... అంత డబ్బు మా దగ్గర లేదు కానీ, మా ఇంట్లో మసిపట్టిన పాత పళ్లెం ఒకటుంది. నీకు పనికొస్తుందంటే అది తీసుకొని, చీర ఇస్తావా?' అని అడిగింది. గోటితో ఆ పళ్లెంను గీకి చూస్తే... అది బంగారపుదని వీరయ్యకు అర్థమైంది. దురాశతో 'ఈ మసి పట్టిన పళ్లెం దేనికి పనికొస్తుంది? దీనికి ఈ రేటు చీరలు రావు. ఇంట్లో వేరేవి ఉన్నాయి. కావాలంటే రేపు తీసుకొస్తా' అన్నాడు. సరేనంటూ పళ్లెం తీసుకొని గుడిసెలోకి వెళ్లిపోయింది అవ్వ. రేపు ఒక పాత చీర తీసుకొచ్చి ఇచ్చి, బంగారు పళ్లెంను పట్టుకెళ్దామని అనుకున్నాడు వీరయ్య. ఒప్పందం ప్రకారం మధ్యాహ్నం 'చీరలమ్మ చీరలూ..' అంటూ గుడిసె ఉన్న వీధిలోకి వెళ్లాడు రామయ్య. అతడిని కూడా పళ్లెం తీసుకుని ఓ చీర ఇవ్వమని అడిగింది అవ్వ. అతడికి అది బంగారపుదని అర్థమైంది. నిజాయతీ కలవాడు కావడంతో వెంటనే 'అవ్వా... ఇది బంగారు పళ్లెం. దీన్ని కొనగలిగే స్తోమత నాకు లేదు. కావాలంటే మన జమీందారు దగ్గరకు నిన్ను తీసుకెళ్తాను... తూకం వేసి మంచి ధర ఇస్తారు. అప్పుడు నువ్వు నా దగ్గర చీర కొనగా... మిగిలిన డబ్బుతో ఏదైనా చిన్న వ్యాపారం కూడా పెట్టుకోవచ్చు' అన్నాడు. అలాగేనంటూ జమీందారు దగ్గరకు వెళ్లారు. పళ్లెం ఆయనకు ఇచ్చి... విషయం చెప్పాడు రామయ్య. బంగారం నాణ్యతను చూసుకొని, దాని విలువకు తగినంత డబ్బును అవ్వకు ఇవ్వడమే కాకుండా... రామయ్య నిజాయతీని మెచ్చుకుని, తన దగ్గరే ఉద్యోగం ఇచ్చాడు జమీందారు. ఈలోగా అవ్వను వీరయ్య మోసం చేయబోయిన సంగతి... ఊరంతా తెలిసింది. దాంతో అప్పటి నుంచి ఊరి వాళ్లు అతడి దగ్గర చీరలు కొనడం మానేశారు. వ్యాపారం సాగక, పూట గడవడం కష్టం కావడంతో ఊరు వదిలి వెళ్లిపోయాడు వీరయ్య.

మసి పట్టిన పళ్లెం!



లెక్క తేల్చండి



ఇక్కడ తాళాలన్నీ గజిబిజిగా పడేసి ఉన్నాయి కదూ! అవి మొత్తం ఎన్ని ఉన్నాయో లెక్కించండి చూద్దాం.

జవాబులు

గప్‌చుప్: 1. గులాబీ 2. మూడు (మెడలోని గొలుసులో అంకె) 3. పంది (దీనికి స్వేద గ్రంథులు ఉండవు) 4. అయిదో తరగతి(బుక్ పైన అంకె) 5. పేపర్‌పైన 4+4 = 8కి బదులు 6 అని ఉంది.

దాగుడుమూతలు: ఫెన్సింగ్‌లో పెన్సిల్, బండరాయి పైన డాల్ఫిన్, బ్యాగ్ మీద కుల్ఫీ, బస్సు కిటికీల స్థానంలో నిచ్చెన, బాటిల్‌లో గ్లాసు, సైకిల్ హ్యాండిల్‌లో బూమరాంగ్, బంతిలో ఎనిమిది అంకె, పొదల్లో చెంచా.

లెక్క తేల్చండి: 16 **అది ఏది?:** 4

పట్టుకోండి చూద్దాం: 1. చెట్టు కొమ్మపైన... 2. పాప టీషర్టుపైన... 3. బాబు జుట్టులో... 4. గోడపైన... 5. పిల్లి వెనక...

చెప్పుకోండి చూద్దాం: DIRECTION (Dog, Icecream, Rat, Eagle, Cat, Tomato, Injection, Orange, Nuts)

పనీర్‌తో పసందుగా!

చేతిలో పనీర్ ఉంటే పదినిమిషాల్లో పసందైన వంటకాలెన్నో చేసుకోవచ్చు. పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టపడే పనీర్... ప్రొటీన్ రిచ్ కూడా. మీ పాకశాస్త్ర నైపుణ్యం చూపించడానికీ, ఇంట్లో వాళ్ల నుంచి ప్రశంసలు పొందడానికీ పనీర్‌ని మించిన పదార్థం మరొకటి ఉండదేమో. మరి దాంతో వంటకాలని ఎలా చేయాలో ఓ సారి చూసేయండి...

పనీర్ మసాలా ర్యాప్



కావలసినవి: పనీర్: 200గ్రా, నూనె: చెంచా, పసుపు: అరచెంచా, కారం: చెంచా, గరంమసాలా: చెంచా, ఉప్పు: రుచికి తగినంత, కాల్చి సిద్ధంగా ఉంచుకున్న రోటీలు: మూడు, పెరుగు లేదా మయొనైజ్: చెంచా, కొత్తిమీర తరుగు: చెంచా, ఉల్లిపాయ ముక్కలు: రెండు చెంచాలు, టొమాటో ముక్కలు: రెండు చెంచాలు.

తయారీ విధానం: ఒక గిన్నెలో నూనె, పసుపు, కారం, గరంమసాలా, ఉప్పు వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని పనీర్ ముక్కలకి బాగా పట్టించి, వాటిని అరగంటపాటు అలా వదిలేయాలి. స్టవ్‌పైన కడాయి పెట్టి మారినేట్ చేసి పెట్టుకున్న పనీర్ ముక్కలని ఓ పదినిమిషాలు వేయించుకోవాలి. రోటీలు లేదా మార్కెట్లో రెడీమేడ్‌గా దొరికే టార్టిల్లా ర్యాప్స్‌ని తీసుకుని వాటిపైన మయొనైజ్ లేదా పెరుగుని రాసుకోవాలి. ఆపైన వేయించిన పనీర్ ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉల్లిపాయముక్కలు, టొమాటో ముక్కలు పరుచుకుని రోటీలని ర్యాప్‌లా చేస్తే పనీర్ మసాలా ర్యాప్స్ సిద్ధం.

ఫ్రైడ్ పనీర్



కావలసినవి: పనీర్: 200గ్రా, **అటుకులు:** చెంచా, గరంమసాలా: అరచెంచా, **కారం:** అరచెంచా, **దనియాలపొడి:** అరచెంచా, **జీలకర్రపొడి:** పావుచెంచా, **పసుపు:** పావుచెంచా, **చాట్‌మసాలా:** అరచెంచా, **కసూరీమేథీ:** చెంచా, **గార్లిక్ పౌడర్:** పావుచెంచా, **జింజర్ పౌడర్:** పావు చెంచా, **మిరియాలపొడి:** పావుచెంచా, **ఉప్పు:** పావుచెంచా, **నూనె:** నాలుగు చెంచాలు.

తయారీ విధానం: అటుకులని మెత్తగా పొడిచేసుకోవాలి. ఒక గిన్నెలోకి అటుకుల పొడి, ఇతర మసాలా పొడులు తీసుకుని అన్నింటినీ బాగా కలుపుకుని, ఉప్పు సరిచూసుకోవాలి. పనీర్‌ని కాస్త మందంగా ఉండేట్టు ముక్కలు కోసి పెట్టుకోవాలి. ఈ ముక్కలకి మసాలాపొడిని దట్టంగా పట్టించి సిద్ధంగా ఉంచుకోవాలి. ఒక పాన్‌పైన నూనె వేసుకుని వేడెక్కాక మసాలా పట్టించిన పనీర్ ముక్కలని ఉంచి అన్నివైపులా దోరగా కాల్చి తీసుకోవాలి.

చిల్లీ పనీర్



కావలసినవి: పనీర్: 200గ్రా, **కార్న్‌ఫ్లోర్:** మూడు చెంచాలు, **మైదా:** మూడు చెంచాలు, **కారం:** అరచెంచా, **మిరియాలపొడి:** అరచెంచా, **ఉప్పు:** తగినంత, **నూనె:** వేయించుకునేందుకు సరిపడా, **వెల్లుల్లి తరుగు:** చెంచా, **పచ్చిమిర్చి ముక్కలు:** రెండు చెంచాలు, **క్యాప్సికమ్ ముక్కలు:** రెండు చెంచాలు.

తయారీ విధానం: పనీర్‌ని క్యూబ్స్ మాదిరిగా తరిగి పెట్టుకోవాలి. ఒక చెంచా కార్న్‌ఫ్లోర్‌లో నాలుగు చెంచాల నీళ్లు వేసి జారుగా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో మిగిలిన కార్న్‌ఫ్లోర్, మైదా, ఉప్పు, కారం, మిరియాలపొడి, పనీర్ ముక్కలు వేసుకుని నాలుగైదు చెంచాల నీళ్లు పోసుకుని మరీ జారుగా కాకుండా కలుపుకోవాలి. జారుగా ఉంటే పిండి పనీర్‌కి పట్టదు. స్టవ్ వెలిగించి కడాయి పెట్టి నూనె వేసుకుని వేడెక్కాక పనీర్ ముక్కలు వేసి బంగారు రంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. కడాయిలో ఎక్కువగా ఉన్న నూనె తీసేసి... ఒక్క చెంచా నూనె ఉంచి దానిలో వెల్లుల్లి తరుగు వేసి అవి వేగాక మిగిలిన కాయగూర ముక్కలు వేయించుకోవాలి. అవి మగ్గాక, ముందుగా కలిపి పెట్టుకున్న కార్న్‌ఫ్లోర్ నీళ్లని వేసి రెండు నిమిషాలు ఉడకనిచ్చి, స్టవ్ కట్టేయాలి. ఆ తర్వాత వేయించి పెట్టుకున్న పనీర్ ముక్కల్ని వేసి కలిపితే చిల్లీ పనీర్ రెడీ.

సెలబ్రిటీ స్పెషల్

బీట్‌రూట్ సలాడ్

- ఆలియాభట్



నేను ప్రతిరోజూ తినే వంటకాల్లో బీట్‌రూట్ సలాడ్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఇది పొట్టనిండిన భావనను కలిగించడంతోపాటు ఎన్నో పోషకాలను కూడా అందిస్తుందని మా డైటీషియన్ చెప్పడం వల్లే.. దాన్ని తప్పనిసరిగా తీసుకోవడం నా దినచర్యలో భాగం చేసుకున్నా. నిజానికి దీని తయారీ కూడా పెద్ద కష్టమేమీ కాదు. ముందుగా ఒక బీట్‌రూట్ తురుముకుని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. దీనిపైన కప్పు నుంచి ఒకటిన్నర కప్పు వరకూ తాజా పెరుగును వేసుకుని రెండింటినీ బాగా కలపాలి. ఇప్పుడు తగినంత ఉప్పు, అరచెంచా చొప్పున చాట్‌మసాలా, మిరియాలపొడి, రెండు టేబుల్‌స్పూన్ల కొత్తిమీర తరుగు వేసుకుని అన్నింటినీ మరోసారి కలుపుకోవాలి. చివరగా.. స్టవ్‌మీద కడాయిని పెట్టి... చెంచా నూనె వేసి.. అరచెంచా చొప్పున ఆవాలు, జీలకర్ర, చిటికెడు ఇంగువ, కాసిని కరివేపాకు రెబ్బలు వేయించుకుని ఈ సలాడ్‌లో వేస్తే సరి. కమ్మని బీట్‌రూట్ సలాడ్ రెడీ అయినట్లే. అయితే, బీట్‌రూట్‌ను పచ్చిగా తినడం ఇష్టంలేనివారు... ఆ తురుమును ఓ రెండు నిమిషాలు ఉడికించుకుని కూడా వాడుకోవచ్చు.



రాశి ఫలం

(జులై 27 - ఆగస్టు 2)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

అదృష్టం వరిస్తుంది. చతుర్థ బుధయోగం వ్యాపార విజయాల్ని ప్రసాదిస్తుంది. భూ, గృహ, వాహన యోగాలు ఉన్నాయి. ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. విమర్శల్ని పట్టించుకోకండి. సౌమ్యంగా సంభాషించండి. కర్మయోగిలా కర్తవ్యాన్ని నిర్వర్తించండి. వారం మధ్యలో ఓ మేలు జరుగుతుంది. సుబ్రహ్మణ్య స్వామిని ఆరాధించండి.



వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అత్యుత్తమ కాలం నడుస్తోంది. ప్రారంభించిన పనులు పూర్తవుతాయి. బాధ్యతతో మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి. కాలం వృథా కాకుండా సకల జాగ్రత్తలూ తీసుకోండి. సమయస్ఫూర్తితో వ్యవహరించండి. ఉద్యోగంలో శుభ ఫలితాలు ఉంటాయి. నష్టాల నుంచి బయటపడతారు. కర్తవ్య నిర్వహణలో ఏకాగ్రత అవసరం. కనకధారాస్తోత్రం పఠించండి.



మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఉత్తమ ఫలితాలు ఉంటాయి. బుధుడు శుభయోగాన్ని అందిస్తాడు. జన్మ శుక్రబలం ఆర్థిక ప్రగతిని ప్రసాదిస్తుంది. సంపదల్ని వృద్ధి చేసుకోడానికి సరైన సమయం. ఉద్యోగ జీవితంలో ఉన్నతిని సాధిస్తారు. ద్వితీయ రవి ప్రభావంతో ఆత్మవిశ్వాసం క్షీణించవచ్చు. మనోబలంతో ఆ పరిమితిని అధిగమించండి. మహాలక్ష్మిని పూజించండి.



కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

చిత్తశుద్ధితో ముందుకు సాగండి. మిత్రుల సాయం తీసుకోండి. శుక్రగ్రహ పరిపూర్ణ సహకారం కారణంగా... ఆర్థికంగా ఎలాంటి సమస్యలూ ఉండవు. మొహమాటం వల్ల ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. వినయగుణాన్ని విడిచిపెట్టకండి. అసూయాపరులతో జాగ్రత్త. ఆధ్యాత్మిక చింతనకు సమయం కేటాయించండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

మనోబలంతో నిర్ణయాలు తీసుకోండి. చంచల స్వభావం నష్టదాయకం. ఆర్థిక లావాదేవీలకు దూరంగా ఉండండి. ఒక ఆపద చుట్టుముట్టే ఆస్కారం ఉంది. ఆత్మీయుల అండతో ఆ అవరోధాన్ని అధిగమిస్తారు. ఉద్యోగంలో కలిసొస్తుంది. గతంలోని ప్రయత్నాలు ఫలితాలను అందిస్తాయి. భవిష్యత్తు ప్రణాళికలు రచించుకుంటారు. శివుడిని పూజించండి.



కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి, ఉద్యోగాల్లో మేలు జరుగుతుంది. ప్రారంభించిన పనులన్నీ విజయవంతం అవుతాయి. ఏకాదశంలోని సూర్యబలం, బుధబలం వ్యాపార విజయాలను అందిస్తాయి. కొత్త ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. సమాజంలో గుర్తింపు లభిస్తుంది. వివాదాలకు దూరంగా ఉండండి. వారాంతంలో ఓ శుభవార్త వింటారు. నవగ్రహాల్ని దర్శించుకోండి.



తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అత్యుత్తమ కాలం నడుస్తోంది. దశమంలోని సూర్యుడు మెరుగైన ఫలితాన్ని అందిస్తాడు. అధికారయోగం ఉంది. వ్యాపార సమస్యల నుంచి బయటపడతారు. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. కుజ, కేతు, చంద్ర గ్రహత్రయం అండగా నిలుస్తాయి. మీవల్ల పదిమందికీ మేలు జరుగుతుంది. కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. లక్ష్మీదేవిని ఉపాసించండి.



వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

సకాలంలో పనుల్ని ప్రారంభించండి. ఏకాగ్రతను పెంచుకోండి. సత్ప్రవర్తనతో మంచిపేరు తెచ్చుకుంటారు. ఆర్థిక వ్యవహారాల్లో మొహమాటం వద్దు. పూచీకత్తులకు దూరంగా ఉండండి. వారం మధ్యలో ఓ విషయంలో స్పష్టత వస్తుంది. ముఖ్యమైన నిర్ణయాల్లో స్వబుద్ధి అవసరం. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

పనుల్ని సకాలంలో ఆరంభించండి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి ముఖ్య నిర్ణయాలు తీసుకోండి. ఆత్మవిశ్వాసం ముందుకు నడిపిస్తుంది. చిన్నచిన్న అవరోధాలు ఎదురైనా ఓర్పుతో వ్యవహరించండి. ప్రయాణాల్లో జాగ్రత్త. పొదుపు-మదుపు అవసరాన్ని అర్థం చేసుకోండి. ఆత్మీయుల సలహాలను పాటించండి. నవగ్రహ ధ్యాన శ్లోకాలు పఠించండి.



మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ముఖ్య వ్యవహారాల్లో విజయం మీదే. ధర్మానికి కట్టుబడి ఉండండి. దీర్ఘకాలిక ప్రణాళికలు రచించుకోండి. పరిస్థితులకు తగినట్టు స్పందించండి. సామరస్య ధోరణితో ముందుకు సాగండి. కొత్త ప్రయత్నాలకు తగిన సమయం కాదు. కొంత ఒత్తిడి ఉంటుంది. సర్దుబాటు గుణం అవసరం. ఆత్మవిశ్వాసాన్ని వదిలిపెట్టుకోకండి. నవగ్రహ శ్లోకాలు చదువుకోండి.



కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

వ్యాపారయోగం ఉంది. ప్రయత్నాలు సఫలం అవుతాయి. అన్నివిధాలా సానుకూల పరిస్థితులు గోచరిస్తున్నాయి. మీ సంస్కారమే మీ బలం. సంపదలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. అపార్థాలకు తావివ్వకండి. సున్నితంగా సంభాషించండి. నిర్ణయాల్లో స్పష్టత అవసరం. దైవబలం కాపాడుతుంది. లక్ష్మీ అష్టోత్తరం పఠించండి.



మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

సంపదలు వరిస్తాయి. పెట్టుబడులు లాభాలను కురిపిస్తాయి. కష్టార్జితాన్ని జాగ్రత్తగా ఖర్చు చేయండి. భూలాభం సూచితం. అంతిమ ఫలితాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగ జీవితంలో కొత్త ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. వ్యాపారంలో లౌక్యం అవసరం. ఏలినాటి శని ప్రభావం ఉంది. జాగ్రత్తగా వ్యవహరించండి. విష్ణు సహస్రనామం పఠించండి.

పదకేళి

కూర్పు: బాలు

1		2	3	■	4		5		■	6	7
	■	8		9		■		■	10	■	
11	12		■		■	13		14	■	15	
16		■	17		18		■	19			
■	20			■		■	21		■		■
22		■	23		■	24		■	25	■	26
	■	27		■	28		■	29		30	
■	31		■	32			33		■		■
34	■	35				■		■	36		37
38	39		■	40		41	■	42		■	
■		■	43		■	44		■	45		■
46				■	47		■	48		■	49

ఆధారాలు- అడ్డం

1. శ్రావణం తరవాత వచ్చే తెలుగు మాసం? (4)
4. బాణుడు రచించిన గద్యకావ్యం (4)
6. అభిలాష, కోరిక (2)
8. 'వదాన్యుడు'లో సగం 'నాగావళి'లో సగం కలిపితే... వాచాలత్వం (4)
10. అడ్డం 6తో లక్ష్యం, ధ్యేయం (1)
11. రత్నం (3)
13. మహాపాపం (3)
15. దూదిచుట్ట, తేలిక అనుకున్నది కష్టంగా మారితే- '.....' మేకు అయింది- అనడం రివాజు (2)
16. రథాన్ని అధిరోహించినవాడు... అటునుంచి (2)
17. అగ్నిదేవుడు (4)
19. చెడ్డవాడు (4)
20. వంతెన (3)
21. కొంగ (2)
22. జుట్టు, కొప్పు (2)
23. రాశి, పోగు (2)
24. ఏనుగు (2)
27. వంటచేయు (2)
28. కెరటం (2)
29. సోమవారం (4)
31. నగారా, దుందుభి (2)
32. ఆంధ్రరాష్ట్ర రాజధాని (5)
35. యమలోకం (4)
36. అతివ (3)
38. అసలు కాదు జిరాక్స్ (3)
40. రూపాయలు (3)
42. ఇల్లు (2)
43. క్రోధం (2)
44. అబద్ధం (2)
45. బాణం (2)
46. సామగ్రి (4)
47. కొంచెం, అల్పం (2)
48. కలప; దుంగ (2)
49. అడ్డం 10తో మర, మెషీన్ (1)

ఆధారాలు- నిలువు

1. గంగానది (4)
2. గాలి (3)
3. దాదాగిరీ (2)
4. కలకత్తాలోని దుర్గామాత (2)
5. బెత్తం, కర్ర (3)
7. శివుడు (4)
9. అన్న భార్య (3)
12. పులిసిన గంజి (4)
13. చెడు; గానం చేయు (2)
14. బంతి (3)
15. గజం (3)
17. ఆధిక్యం కలిగినవాడు (4)
18. తలకిందులైన 'అంగుళి' (2)
21. గిరిగీసిన ప్రదేశం, హద్దు (2)
22. దెబ్బ, ఘాతం (2)
24. అతిసారవ్యాధి (3)
25. ఇరుకు దారి, సన్నని గల్లీ (2)
26. దండ, హారం (2)
27. రుచిలో ఈ కూరగాయకు సాటిలేదంటారు... బహువచనం (4)
28. పొందిక, కుదిరిక (4)
29. స్త్రీ (2)
30. చేపలలో ఒక రకం (3)
32. అపూర్వం (4)
33. వేగం (2)
34. పిల్ల, బిడ్డ (2)
36. కురుక్షేత్ర యుద్ధంలో పడిపోయాక భీష్ముడు దేనిపై విశ్రమించాడు? (4)
37. జంబుకం (2)
39. పరిమళం కలిగిన లేత ఎరుపు రంగు కలువ! (3)
41. అనుమానాలు... తలకిందులుగా (3)
43. చాలాకాలం స్పృహలేని స్థితి (2)

సుడొకు

	6	9			5		3	4
				8	3	9		5
				6		1	8	
			2		4		9	7
1	4		3		6			
	9	6		7				
4		2	5	3				
7	1		6			8	2	

గతవారం సమాధానాలు

పదకేళి

1 మౌ	2 సం	■	3 స్వా	■	4 జా	5 బి	లి	■	6 పం	ది	7 రి
■	8 ద	9 ర	హ	10 సం	■	లం	■	11 పై	కం	■	మ్మ
12 ఆ	న	తి	■	13 తో	రం	■	14 ఈ	శా	■	15 బం	■
16 న	వ	■	17 వి	షం	■	18 ఊ	■	19 చి	రు	గా	లి
■	20 నం	21 ది	ని	■	22 పా	■	23 అం	కం	■	రం	■
24 సు	■	గం	■	25 జ	గ	న్మా	త	■	26 అ	■	27 క
■	28 అం	బ	లి	■	రు	■	29 రం	30 గు	ల	31 రా	ట్నం
32 ఆ	ద	రం	■	33 సూ	■	34 బం	గా	రు	వా	చీ	■
35 క	లం	■	36 ఉ	దం	తం	■	లు	■	టు	■	37 వే
లి	■	38 పి	■	టు	■	39 ధ	■	40 ఉం	■	41 గం	ట
■	42 మ	ను	మ	రా	లు	■	43 గ	గ	నం	■	గా
44 మ	ది	ర	■	యి	■	45 ఉ	ద	రం	■	46 దిం	డు

సుడొకు

1	8	5	2	6	4	9	7	3
6	7	4	3	8	9	2	1	5
3	2	9	7	5	1	8	4	6
8	5	1	6	9	2	4	3	7
7	3	2	4	1	5	6	8	9
4	9	6	8	3	7	5	2	1
5	1	8	9	4	3	7	6	2
9	4	7	1	2	6	3	5	8
2	6	3	5	7	8	1	9	4

A B C D E F 1 2 3

కనుచూపుమేరా...

జనపనార!







మన దగ్గర ఊళ్లల్లో ఒక్కొక్కరూ ఒక్కో పని చేసుకుంటూ కనిపిస్తారు. కానీ పశ్చిమ్ బంగాలోని బోర్టిర్ బిల్ సరస్సు చుట్టుపక్కల గ్రామాల వాళ్లందరి పని మాత్రం ఒకటే. అక్కడున్న కుటుంబాలన్నీ ఏడాదంతా జనపనారను తయారుచేసే పనిలోనే నిమగ్నమవుతాయి. జనపనార విత్తనాలు వేసి, మొక్కలు పెరిగాక కత్తిరించి మోపులు కడతారు. మళ్లీ వాటిని సరస్సులో నానబెట్టి, నారను వేరుచేసి, శుభ్రం చేసి, ఆ తర్వాత ఆరబెడతారు. అలా జనుము మొక్కల పెంపకం నుంచి నారను తయారుచేసే వరకూ రకరకాల ఆ దశలన్నీ ఈ ప్రాంతానికి ప్రత్యేక అందాన్ని తీసుకొస్తాయి. నీటిపైన తేలే రంగుల మొక్కల మోపులూ, దారికి ఇరువైపులా ఆరబెట్టిన కుప్పలూ చూడ్డానికి గమ్మత్తుగా ఉంటాయి. విలక్షణమైన ఈ పచ్చటి పరిసరాల్ని ఆస్వాదించడానికి వివిధ ప్రాంతాల నుంచీ వచ్చే పర్యటకులు... పడవల్లో సరదాగా షికారు చేస్తూ ఫొటోలు తీసుకుంటారు.














ఆలయంలోకి అడుగుపెడితేనే మనసుకెంతో ప్రశాంతంగా ఉంటుంది. అలాంటిది పచ్చటి చెట్ల నడుమ అడవిలో కొలువైన కోవెలకి వెళితే... ఆ ఆహ్లాదకరమైన వాతావరణం మనసుకు మరెంత హాయినిస్తుంది! కేరళలోని పాలప్పిలీలో ఉండే 'ఒత్తనాడు శివాలయం' భక్తులకు ఆ అనుభూతినే అందిస్తుంది. ప్రకృతి రమణీయతతో అలరారే ఈ దేవాలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. కేరళ, తమిళ సంప్రదాయ నిర్మాణ శైలితో కనువిందుచేస్తూ... భక్తులతోపాటు ప్రకృతి ఆరాధకుల్నీ ఎంతగానో ఆకట్టుకుంటోంది.